RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 169 | గురువారం,09, జనవరి, 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

## భారత భూభాగాన్ని ఎవరూ ఆక్రమించలేదు: బీఎస్ఎఫ్

న్యూఢిల్లీ, జనవరి 8: అంతర్జాతీయ సరిహద్దు వెంబడి 5 కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని బంగ్లాదేశ్ ఆక్రమించిందన్న వార్తలను భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎస్) కొట్టిపారేసింది. బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ) దళాలు 5 కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయంటూ బంగ్లా మీడియాలో వార్తలు వచ్చాయి. అవన్నీ పూర్తిగా బాధ్యతారహిత, నిరాధారమైన కట్టు కథలని బీఎస్ఎఫ్ పేర్కొంది. "ఉత్తర 24 పరగణాల జిల్లా, రాంఘాట్ గ్రామంలోని బాగ్దా బ్లాక్‌లో ఉన్న భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడలియా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి, కంచె వేసి ఉంది. ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎలాంటి మార్పు జరగలేదు" అని బీఎస్ఎఫ్ అధికారిక ప్రకటనలో తెలిపింది. భారత భూభాగాన్ని ఎవరూ ఒక్క అంగుళం కూడా తీసుకోలేదని, తీసుకోలేరని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు కల్పిత కథనాలను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించింది.



## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

**-వారం పాటు రూ.1.5 లక్షల వరకు**

**-చికిత్స ఖర్చును కేంద్రం భరిస్తుంది : గడ్కరీ వెల్లడి**

న్యూఢిల్లీ, జనవరి 8: రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స పథకం ఇక దేశమంతా అమలవుతుందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పటి వరకు ఆరు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన ఈపథకాన్ని అన్ని రాష్ట్రాలకూ విస్తరించనున్నామని చెప్పారు. ఏడు రోజుల పాటు రూ.లక్షన్నర వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఆస్పత్రిలో చేరి, ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు పోలీసులకు సమాచారంఅందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 'హిట్ అండ్ రన్' (గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్ట పరిహారం ఇస్తామని గడ్కరీ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రవాణా శాఖ మంత్రులు, కార్యదర్శులతో సమావేశం అనంతరం నగదురహిత చికిత్స పథకాన్ని ప్రకటించారు.



# ఆంధ్రాకు అండ





- ➢➢ మీ సంకల్పానికి మా సహకారం.. ప్రధాని భరోసా
- ➢➢ ఆంధ్రుల ఆశయాల సాధనకు తోడ్పడతాం
- ➢➢ బాబు 'విజన్ 2047'కు సంపూర్ణ మద్దతు
- ➢➢ ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాలకు ఏపీ కేంద్రంగా మారుతోంది
- ➢➢ ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి కేంద్రం మద్దతిస్తుంది
- ➢➢ దేశంలో రెండు హైడ్రోజన్ హబ్‌లు.. ఏపీలో ఒకటి
- ➢➢ దక్షిణ మధ్య రైల్వే జోన్‌తో రాష్ట్ర ప్రగతికి ఊతం
- ➢➢ విశాఖ సభలో ప్రధానమంత్రి మోదీ భరోసా
- ➢➢ రూ.2.08 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆంధ్రప్రదేశ్ ఆశయాల సాధనకు కేంద్రంలోని తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. చంద్రబాబు 'విజన్-2047'కు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. వరుసగా మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తొలిసారి విశాఖపట్నానికి వచ్చిన మోదీ రూ.2.08 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. విభజన హామీల్లో కీలకమైన విశాఖపట్నం రైల్వేజోన్‌తోపాటు గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్క్‌లకు శంకుస్థాపన చేశారు. పలు రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. 'ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి నా కృతజ్ఞతలు. మీపట్ల నాకున్న అభిమానం చూపించే అవకాశం ఇప్పుడు లభించింది.

# కార్యకర్తలను పట్టించుకోండి!

- ♦ మంత్రుల పనితీరుపై ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్యేల తీరుపై కార్యకర్తలు హ్యాపీగా లేరు
- ♦ అందరూ పనితీరును మెరుగుపరచుకోవాలి..
- ♦ సంక్షేమ కార్యక్రమాల అమలు బాగుంది
- ♦ ప్రచారం ప్రజల్లోకి వెళ్లేలా పీసీసీ చూడాలి..
- ♦ పీఏసీ భేటీలో కేసీ వేణుగోపాల్ నిర్దేశం
- ♦ నెలలో కమిటీల నిర్మాణం..
- ♦ త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి పీఏసీ నిర్ణయం



"అధికారం వచ్చి ఏడాది గడిచింది. మీరు పదవులు అనుభవిస్తున్నారు. ఇకనైనా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కార్యకర్తలకు న్యాయం చేయండి.. వారిని కాపాడుకోండి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసి వారికి అవకాశం కల్పించండి" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్.. టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని, వారి పనితీరుకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందని అన్నారు. మంత్రుల పనితీరు పట్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల పనితీరు పట్ల పార్టీ కార్యకర్తలూ సంతోషంగా లేరని తెలిపారు. దీనిని సరిదిద్దుకోవాలని సూచించారు. గాంధీభవన్‌లో వారానికోసారి నిర్వహిస్తున్న 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమాన్ని జిల్లాల్లోనూ నెలకోసారి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు, కార్యకర్తలకు దగ్గర కావాలన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను సీఎం రేవంత్‌రెడ్డి, పీఏసీ సభ్యులు వివరించగా.. వాటి అమలుతీరుపై వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లడంలేదని, పార్టీ సోషల్ మీడియా వింగ్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యాచరణను అమలు చేయాల్సిందిగా పీసీసీకి సూచించారు. ఇక 2025 సంవత్సరాన్ని పార్టీ సంస్థాగత నిర్మాణ సంవత్సరంగా తీసుకోవాలని వేణుగోపాల్ అన్నారు. బ్లాక్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు.

# రాష్ట్రంలో త్రీడీ పాలన



- ♦ డిసెప్షన్.. డిస్ట్రాక్షన్.. డిస్ట్రక్షన్.. ఏడాదిగా ఇదే!
- ♦ హామీలపై మాట తప్పిన కాంగ్రెస్‌ను నిలదీద్దాం
- ♦ ప్రభుత్వ మోసంపై ఏడాదంతా కొట్లాడుదాం
- ♦ ఒక్కో కార్యకర్త ఒకో కేసీఆర్‌లా పోరాడాలి
- ♦ అక్రమ కేసులకు ఎవ్వరూ భయపడొద్దు
- ♦ బీఆర్ఎస్ పార్టీ 60 లక్షల మంది కుటుంబం
- ♦ గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలు
- ♦ పార్టీ కార్యకర్తలకు శిక్షణ తరగతుల నిర్వహణ
- ♦ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి
- ♦ కోతలు, లేకపోతే ఎగవేతలు, కాదంటే కేసులు
- ♦ ఏడాది పాలనలో ప్రజలకు సీఎం చేసిందేం లేదు
- ♦ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్
- ♦ తెలంగాణ భవన్‌లో ఘనంగా పార్టీ డైరీ ఆవిష్కరణ

రాష్ట్రంలో త్రీడీ పాలన (డిసెప్షన్, డిస్ట్రాక్షన్, డిస్ట్రక్షన్.. మోసం, విధ్వంసం, విస్మరణ) కొనసాగుతున్నదని.. రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ మోసంపై కొట్లాడుదామని బీఆర్ఎస్ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ ఏడాది మొత్తాన్ని పోరాట నామ సంవత్సరంగా భావిస్తూ ప్రభుత్వంపై పోరాడుదామని చెప్పారు. ఒక్కో కార్యకర్త ఒకో కేసీఆర్‌లా మారి 420 హామీల అమలుకు ప్రభుత్వంపై పోరాడాలని దిశానిర్దేశం చేశారు. 60 లక్షల మంది సభ్యులున్న అతిపెద్ద కుటుంబం బీఆర్ఎస్ పార్టీదని, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కొత్త కమిటీలు వేసుకుందామని చెప్పారు. పార్టీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తామని వెల్లడించారు. తెలంగాణభవన్‌లో బుధవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, పొన్నాల, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి 'బీఆర్ఎస్-2025 డైరీ'ని కేటీఆర్ ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కొందరు వక్తలు ఇబ్బందేదో ఉన్నట్టు చెప్పారు. కానీ, నిజానికి మనకు ఇబ్బందేమీలేదు.

# అంతా కేటీఆరే చేశారు!



- ఫార్ములా-ఈ కారు రేసు ఒప్పందాలు,
- చెల్లింపులన్నీ ఆయన కనుసన్నల్లోనే జరిగాయి
- నిబంధనల ఉల్లంఘన గురించి మంత్రికి చెప్పాం
- మళ్లీ మనదే అధికారం.. ప్రొసీడ్ అన్నారు
- ప్రభుత్వ అధికారిగా.. మంత్రి చెప్పినట్లు చేశాను
- ప్రజాధనం దుర్వినియోగాన్ని అడ్డుకోలేకపోయాను
- ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీ కేటీఆర్ స్నేహితుడిది
- రేసు నిర్వహణలోకి పురపాలక శాఖను లాగారు
- ఏసీబీ విచారణలో అర్వింద్ కుమార్ వెల్లడి!
- ఆరు గంటలపాటు సుదీర్ఘంగా సాగిన విచారణ

ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారమంతా నాటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ కనుసన్నల్లోనే జరిగిందని అప్పట్లో ఆ శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా వ్యవహరించిన అర్వింద్ కుమార్.. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది.

### తిరుమలలో తొక్కిసలాట..!

# ఆరుగురు దుర్మరణం...!







**వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో అపశ్రుతి**
**బైరాగిపట్టెడ కేంద్రంలో తీవ్ర తొక్కిసలాట**
**ఆరుగురి మృతి పెద్దసంఖ్యలో భక్తులకు గాయాలు**
**క్యూల్లోకి అనుమతించడంతో దూసుకొచ్చిన భక్తులు**
**ఒత్తిడి తట్టుకోలేక ఊడి, తెరుచుకున్న గేటు**
**ఒక్కసారిగా తొక్కిసలాట... నలిగిపోయిన భక్తులు**
**టీటీడీ చరిత్రలోనే తొలిసారిగా ఇలాంటి దుర్ఘటన**

'తిరుమల' చరిత్రలోనే కనీవినీ ఎరుగని విషాదం చోటుచేసుకుంది! రద్దీ సమయాల్లో తొక్కిసలాటలు జరగడం సాధారణమే అయినప్పటికీ... తొలిసారిగా, ఆ దశ దాటి భక్తుల మరణాలూ చోటు చేసుకున్నాయి. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనుండగా... తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ జారీ కౌంటర్ మృత్యు వేదికయింది. సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు.. తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో ఏకంగా 90 టోకెన్ జారీ కౌంటర్లను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి ఇలా గేట్లు తెరవగానే అలా భక్తులు ఒక్కసారిగా దూసుకురావడంతో.. పలుచోట్ల తొక్కిసలాట జరిగింది. అందులో.. బైరాగిపట్టెడ కేంద్రం వద్ద పరిస్థితి మరింత విషమించింది. రద్దీలో ఇరుక్కుపోయిన భక్తులు ఊపిరాడక అల్లాడిపోయారు. మహిళలు మరింత విలవిలలాడారు. ఈ విషాదంలో ఆరుగురు మరణించగా.. వారిలో ఐదుగురు మహిళలే. తొక్కిసలాటలో పెద్ద సంఖ్యలో భక్తులు గాయపడ్డారు. వారికి తిరుపతిలోని స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటల్లో గాయపడటం వంటి ఘటనలు జరిగినప్పటికీ.. మరణాలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి. టీటీడీ చరిత్రలోనే ఇది మాయని మచ్చలా మిగిలిపోనుంది!

తెలంగాణ సేన

గురువారం,09, జనవరి, 2025

# రాష్ట్రంలో త్రీడీ పాలన

2001లో కేసీఆర్ పార్టీ పెట్టిన రోజున ఉండే ఇబ్బందులతో పోల్చితే.. ఇది ఇబ్బందే కాదు. కేసీఆర్ ఆనాడు కడుపు మాడ్చుకొని తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ జైత్రయాత్రనో.. కేసీఆర్ శవ యాత్రనో అని కూర్చున్నప్పటి ఇబ్బంది ముందు ఇదేం ఇబ్బంది? తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూలో బాల సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తోపాటు పలువురు విద్యార్థి నేతల వీపులపై లాఠీలు విరిగాయి. పోలీసుల లాఠీ దెబ్బలకు శరీరాలు కమిలిపోయాయి. యాదయ్య, శ్రీకాంతాచారి ఒంటి మీద పెట్రోల్ పోసుకుని భగభగ మంట మండుతుంటే ఆ ఇబ్బంది ముందు ఇదేం ఇబ్బంది? కేసీఆర్ పార్టీ పెట్టినప్పుడు మజిల్ పవర్, మీడియా పవర్ లేదు. అగమ్య గోచర పరిస్థితుల్లో తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసి చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్. అలాంటి కేసీఆర్ తయారు చేసిన సైనికుడిగా, కేసీఆర్ రక్తం పంచుకుపుట్టిన బిడ్డగా ఈ అక్రమ కేసుకు భయపడుతమా? ఇది ఇబ్బంది కానేకాదు. ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. మనకు మంచి లాయర్లు ఉన్నరు. బీఆర్ఎస్ లీగల్ టీమ్ ఉన్నది. న్యాయస్థానాల్లో కొట్లాడుదాం. తప్పు చేయలేదు కాబట్టి ఎవ్వరికీ బయపడేది లేదు' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

రైతులకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ప్రభుత్వం చేసిన మోసంపై ఏడాదంతా మాట్లాడుదాం.. నిలదీద్దాం.. అంతేగాని నాపై పెట్టిన అక్రమ కేసు గురించి ఎవరూ ఆలోచించాల్సిన అవసరం లేదు. ఈ అక్రమ కేసుపై నేను చట్టప్రకారం కొట్లాడుతా. తప్పు చేయనప్పుడు ఎవ్వరికీ బయపడేది లేదు. హైదరాబాద్ కోసం, తెలంగాణ కోసం తీసుకున్న నిర్ణయాలే అన్నీ. ఈ అక్రమ కేసుకు ఎవరూ భయపడాల్సిన పనిలేదు.

– కేటీఆర్

**బూత్‌స్థాయి నుంచి కమిటీలు**

త్వరలోనే పార్టీ సభ్యత్వ నమోదు, కొత్త కమిటీలు ఏర్పాటు చేసుకుందామని కేటీఆర్ చెప్పారు. బూత్, గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు ఏర్పాటు చేద్దామని తెలిపారు. జిల్లా నాయకులు హైదరాబాద్ రావడం కాదని, తామే జిల్లాలకు వస్తామని చెప్పారు. కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిద్దామని తెలిపారు. 60 లక్షల మంది సభ్యులున్న అతిపెద్ద బీఆర్ఎస్ కుటుంబం మనదని స్పష్టంచేశారు.

**నాడు ఉద్యమానికి ఊతం: హరీశ్**

నాడు డైరీ ఆవిషరణ కార్యక్రమాలు తెలంగాణ ఉద్యమ సభలుగా విల్లసిల్లాయని, ఉద్యమానికి గొప్ప ఊతమిచ్చాయని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీ డైరీని తిరగేస్తుంటే 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానం, విజయాలు కండ్ల ముందు కనిపిస్తున్నాయని తెలిపారు. పార్టీ ప్రతి నేత, కార్యకర్త లు ఈ డైరీని తమ దగ్గర పెట్టుకోవాలని సూచించా రు. ఆనాటి డైరీ ఆవిషరణ సభలు రాష్ట్ర సాధనకు ఉపయోగపడితే, నేటిసభ బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలపడానికి, తిరిగి అధికారంలోకి తెచ్చుకోవడానికి ఉపయోగపడాలని కోరారు.

లగచర్ల గిరిజన రైతులకు కేటీఆర్ అండగా నిలబడి కొట్లాడారు. కేటీఆర్ మీద కేసు అంటే ఒక ప్రశ్నించే గొంతుపై, ఒక ఉద్యమకారుడిపై పెట్టిన కేసు. ఇవ్వాళ రేవంత్ సర్కార్ గ్రాఫ్ దిగజారిపోతున్నందున ఇలాంటి కేసులు పెట్టి ప్రజలను డైవర్షన్ చేస్తున్నడు. ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఆపదొస్తే బీఆర్ఎస్ ఎట్లా అండగా నిలుస్తదో.. అలానే పార్టీ మొత్తం కేటీఆర్ వెంట ఉంటది. – హరీశ్‌రావు

**కోతలు, ఎగవేతలు, కేసులు**

సీఎంగా రేవంత్‌రెడ్డి ఏడాది పాలన ముగిసిందని, ఏడాదిలో ఏమన్నా చేసిండ్రా అంటే.. కోతలు, ఎగవేతలు, కాదంటే కేసులు తప్ప ఏమీలేవని హరీశ్ ఎద్దేవా చేశారు. 'ఎగ్గొట్టినోన్ని ఎగ్గొట్టిండు అంటే కూడా తప్పేనా? 'ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్నందుకు మానకొండురు పోలీస్‌స్టేషన్లో నామీద కేసు పెట్టిండు. పోలీస్‌స్టేషన్‌కు రమ్మని నాకు నోటీసులు వస్తున్నయి. ఎగవేతలు నిజం కాదా? ఏడాదిలో ఏం చేసినవు?' అని నిలదీశారు.

**పిల్లలు పుట్టాక కల్యాణలక్ష్మి చెక్కులు**

ఎన్నికల ముందు పెండ్లి కాకముందే కల్యాణలక్ష్మి చెక్కు, తులం బంగారం ఇస్తామని చెప్పారని, ఇప్పుడు పిల్లలు పుట్టాక కూడా ఇవ్వడం లేదని హరీశ్ మండిపడ్డారు. ఎంతోమంది లబ్ధిదారులుంటే కొందరికే.. అదీ పిల్లలు పుట్టాక చెక్కులు వస్తున్నాయని ఎద్దేవాచేశారు. 'జార?ండ్‌లో మహిళలకు 2,500 పింఛన్ ఇస్తామని చెప్పి, మొదటి నెలలోనే అకడి కొత్త సీఎం హేమంత్ సోరెన్ మాట నిలబెట్టుకున్నరు. రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో ఇస్తానని బాండ్ పేపర్‌పై సంతకం పెట్టి, 13 నెలలు గడిచినా మహాలక్ష్మి అమలు చేయలేదు. మొదటి నెలలోనే 2 వేల పింఛన్‌ను 4 వేలు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాట నిలబెట్టుకున్నది. రేవంత్‌రెడ్డి 40 లక్షల మంది అవ్వాతాతలకు 4 వేల ఆసరా పింఛన్ ఇవ్వకుండా మాట తప్పారు' అని దుయ్యబట్టారు.

పార్టీ పెట్టినప్పుడు.. తెలంగాణ ఉద్యమకారులు పడిన ఇబ్బందులు, అమరవీరుల త్యాగాలతో పోల్చితే ఇప్పుడున్నది ఇబ్బందికర పరిస్థితేం కాదు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ తయారుచేసిన సైనికుడిని.. ఈ అక్రమ కేసుకు భయపడుతనా?

– కేటీఆర్

**లగచర్ల రైతులకు అండగా నిలిచిన కేటీఆర్**

బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ లగచర్ల గిరిజన రైతులకు అండగా నిలిచి న్యాయం చేశారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రాఫ్ దిగజారిపోతున్నందున ఇలాంటి కేసులు పెట్టి ప్రజలను డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఆపదొస్తే బీఆర్ఎస్ ఎలా అండగా నిలబడిందో అలానే పార్టీ మొత్తం కేటీఆర్ వెంట ఉంటుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సునీతా లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, రెడ్యానాయక్, శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు వంటేరు యాదవరెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్‌జాదవ్, మాజీ ఎంపీలు లింగయ్యయాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కవిత, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, బాల్క సుమన్, నలమోతు భాస్కర్‌రావు, రసమయి బాలకిషన్, రేగా కాంతారావు, కోరుకంటి చందర్, నాయకులు కర్నె ప్రభాకర్, వంటేరు ప్రతాపరెడ్డి, దేవీ ప్రసాద్, బాలమల్లు, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కిశోర్‌గౌడ్, చిరుమళ్ల రాకేశ్, దూగుంట్ల నరేశ్ పాల్గొన్నారు.

**హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి**

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీయాలని శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. లగచర్ల రైతులు తమ భూమి గుంజుకోవద్దనందుకు 40 రోజులు జైల్లో అక్రమంగా పెట్టిన దానితో పోల్చితే ఇప్పుడున్న ఇబ్బందికర పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. ఇబ్బందిలో ఉన్నామనుకోవద్దని, రైతులను చైతన్యపర్చాలని, కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి రైతుకు ఒక్కో ఎకరానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేలు బాకీ ఉన్నదని చెప్పాలి. దేవుళ్లపై ఒట్లు వేసి రుణమాఫీపై మాట తప్పారని చెప్పాలి. రైతు రుణమాఫీ, కౌలు రైతులకిచ్చిన కాంగ్రెస్ హామీలపై నిలదీయాలి. రైతులకు, ప్రజలకిచ్చిన హామీల అమలు, ప్రభుత్వ మోసంపై ఏడాదంతా మాట్లాడుదాం. కొట్లాడుదాం' అని కేటీఆర్ స్పష్టంచేశారు. రాష్ట్రంలో త్రీడీ పాలన (డిసెప్షన్, డిస్ట్రాక్షన్, డిస్ట్రక్షన్.. మోసం, విధ్వంసం, విస్మరణ) కొనసాగుతున్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ.2500 చొప్పున ఇస్తున్నామని ఢిల్లీ కాంగ్రెస్ నేతలు కూడా అబద్ధాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ కోసం అందరం కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు.

మానకొండూర్ సభలో రేవంత్‌రెడ్డీ నువ్వు రుణమాఫీ ఎగ్గొట్టినవ్.. రైతుబంధు ఎగ్గొట్టినవ్.. తులం బంగారం ఎగ్గొట్టినవ్.. మహిళలకు మహాలక్ష్మి ఎగ్గొట్టినవ్.. వృద్ధులకు 4 వేల ఆసరా పింఛన్ ఎగ్గొట్టినవ్.. నీ పేరు ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు, ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్నందుకు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో నామీద కేసు పెట్టిండు. ఎగ్గొట్టినోన్ని ఎగ్గొట్టిండు అంటే కూడా తప్పేనా? ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కు రమ్మని నాకు నోటీసులు వస్తున్నయి. నువ్వు ఎగ్గొట్టింది నిజం కాదా? నువ్వు కోతలు పెట్టింది నిజం కాదా? ఏడాదిలో ఏం చేసినవ్ నువ్వు? పబ్లిక్ అటెన్షన్ డైవర్షన్ తప్ప?

–హరీశ్‌రావు

### తిరుమలలో తొక్కిసలాట..!

# ఆరుగురు దుర్మరణం....!

తిరుమల తిరుపతి దేవస్థానాల చరిత్రలోనే కనీవినీ ఎరుగని విషాదం చోటుచేసుకుంది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ వద్ద తీవ్ర తొక్కిసలాట జరిగింది. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీనికోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాల వద్ద తొక్కిసలాటలు జరిగాయి. ప్రత్యక్షసాక్షులు, ఇతర వర్గాల కథనం ప్రకారం...

**బైరాగిపట్టెడలో మరణ మృదంగం**

బైరాగిపట్టెడలోని రామానాయుడు మునిసిపల్ హైస్కూ లు ఆవరణలో టోకెన్ల జారీకి పది కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడికి మధ్యాహ్నం నుంచే తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాలు, తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. హైస్కూలు వెనుకవైపు మునిసిపల్ పార్కు లో కూర్చుని... ఎదురు చూస్తున్నారు. రాత్రి 8.50 సమయంలో క్యూలైన్లలోకి అనుమతించడంతో అందరూ పరుగులు తీశారు. పార్కు నుంచి స్కూలులోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన గేటుపై జనం పడటంతో అది ఒక్కసారిగా తెరుచుకుంది. పెద్దసంఖ్యలో భక్తులు లోనికి వెళ్లేందుకు యత్నించడంతో తొక్కిసలాట జరిగింది. భక్తుల్లో మహిళలు, వృద్ధులు ఉండడంతో చాలామంది కిందపడిపోయారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పోలీసులు అదనపు బలగాలను రప్పించి అదుపు చేసేసరికే దారుణం జరిగిపోయింది. తొక్కిసలాటలో పలువురు అపస్మారక స్థితికి చేరుకున్నారు. పోలీసులు, స్థానికులు సీపీఆర్ వంటి చర్యలు చేపట్టారు. మరో కథనం ప్రకారం... బైరాగిపట్టెడ కేంద్రంలో ఓ మహిళ అస్వస్థతకు గురి కావడంతో ఆమెను బయటికి తీసుకొచ్చేందుకు పోలీసు అధికారి గేటు తెరిచారని, దీంతో భక్తులు ఒక్కసారిగా ముందుకు రావడంతో తొక్కిసలాట జరిగింది. క్షతగాత్రులను రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు.

**తొక్కిసలాట ఘటన బాధాకరం: ప్రధాని మోదీ**

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరమని, బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందిస్తోందని పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి: రాహుల్**

తిరుపతి తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి ఘటన జరగడం బాధాకరమని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో బాధితులకు అండగా నిలవాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు రాహుల్ పిలుపునిచ్చారు.

**చైర్మన్ రాజీనామా చేయాలి**

బీసీవై అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ తొక్కిసలాటలో స్వామి వారి భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేయడంలో టీటీడీ అధికారులు విఫలం అయ్యారని ఆరోపించారు. వైకుంఠ ద్వార దర్శనాలు జరిగినన్ని రోజులు మరింత అప్రమత్తంగా ఉంటూ సామాన్య భక్తులకు దర్శనం కల్పించాలన్నారు.

**రద్దీని కంట్రోల్ చేసుంటే..**

కౌంటర్ల వద్ద కనీసం సౌకర్యాలు కల్పించలేదు, పోలీసుల నిర్లక్ష్యం బాగాఉంది. అర్థగంట ముందుగా వచ్చిన రద్దీని కంట్రోల్ చేసుంటే కచ్చితంగా తొక్కిసలాట జరిగేది కాదు. సకాలంలో స్పందించి వుంటే కూడా ఈ దారుణం చోటుచేసుకునేదికాదు.

**-సీపీ రమణ, నర్సీపట్నం**

**పోలీసుల వైఫల్యమే**

మా కళ్లముందే మావాళ్లను తొక్కేయడం చూశా. ఇది పూర్తిగా పోలీసుల వైపల్యమే. బయట ఉన్నారే గాని పార్కు లోపలకువచ్చి కంట్రోల్ చేయలేకపోయారు. – మునివెంకటప్ప, ఊలపాడు

**స్వల్పగాయాలతో బయటపడ్డాం**

అందరూ కలసి ఒక్కసారిగా గేటును నెట్టుతున్న సమయంలో పోలీసులు స్పందించి అదుపు చేసుంటే పరిస్థితి చక్కబడేది. ఈ ఘటనలో నా భార్య, బిడ్డలు స్వల్పగాయాలతో బతికి బయటపడ్డారు.

**-బి.అంజప్ప, నర్సాపురం**

**ఉన్నతస్థాయి విచారణ చేయాలి: పురందేశ్వరి**

ఏడుకొండల వాడా మమ్మల్ని క్షమించు స్వామీ.. భక్తకోటి క్షమించండి.. అంటూ తిరుపతి తొక్కిసలాట దుర్ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాలకమండలిని కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఏడుకొండల వాడి పాదాల చెంత ఇటువంటి దుర్ఘటన జరగడం తీవ్ర మనస్థాపం కలిగించిందని బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు.

**దురదృష్టకరం: ఎంఎస్ రాజు**

తిరుపతిలో తొక్కిసలాటలో భక్తులు మృతిచెందడం బాధాకరమని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి లోను చేసిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు. భక్తులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

# ఆంధ్రాకు అండ

ముందుగా సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామికి నమస్కారం' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత హిందీలో మాట్లాడారు. "60ఏళ్ల తర్వాత కేంద్రంలో మూడోసారి వరుసగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రజల ఆశీర్వాదంతోనే ఇది సాధ్యమైంది. రాష్ట్రంలో ఎన్డీయేకు భారీ విజయాన్ని కట్టబెట్టారు. విశాఖపట్నంలో అద్భుత స్వాగతం, రోడ్డు పొడవునా ఆశీర్వాదం ఇవ్వడం సంతోషంగా ఉంది" అని మోదీ హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు మాట్లాడిన చంద్రబాబు తన ప్రసంగంలో సిక్సలు కొట్టారని, ఆయన ఒక్కో మాటలో అంశాన్ని గుర్తుంచుకుంటానని తెలిపారు. ఆంధ్రుల ఆకాంక్షలను చంద్రబాబుతో కలిసి నెరవేరుస్తానని మోదీ మాటిచ్చారు. రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో ప్రయాణిస్తాయన్నారు. 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మా విజన్. ఆంధ్రుల సేవ మా సంకల్పం. 2047నాటికి రాష్ట్రం 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలన్న విజన్‌తో చంద్రబాబు శ్రమిస్తున్నారు. ఈ ప్రయాణంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి భుజం కలిపి తోడుగా నిలుస్తుంది" అని మోదీ ప్రకటించారు.

**కొత్త శిఖరాలకు...**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రధాని తెలిపారు. "విశాఖపట్నంలో ఈ రోజు 2లక్షల కోట్లకు పైగా నిధులతో ప్రాజెక్టులు ప్రారంభించాం. దీంతో రాష్ట్రాభివృద్ధి కొత్త శిఖరాలకు చేరుతుంది. ఇక్కడి ప్రజల సృజనాత్మకత వల్ల రాష్ట్రం ప్రగతిశీలకంగా మారింది. ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ సరికొత్త కేంద్రంగా మారుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే గ్రీన్ హైడ్రోజన్ వైపు అడుగులు వేస్తున్నామన్నారు. 2023లో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ప్రారంభించామని... రెండు కేంద్రాల్లో ఒకటి విశాఖకు కేటాయించామని చెప్పారు. భవిష్యత్తులో హైడ్రోజన్ ఉత్పత్తిలో విశాఖపట్నం ప్రపంచంతో పోటీ పడుతుందని, గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉంటాయని ప్రధాని తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హబ్ ఏర్పాటు చేసే అవకాశం లభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. పెట్టుబడులకు అనుకూలమైన మూడు రాష్ట్రాల్లో ఆంధ్రపద్రేశ్ ఒకటని తెలిపారు. "రాష్ట్రం పెట్టుబడిదారులకు అనుకూలం. ఫార్మా రంగానికి ఉపయోగం. ఎన్డీయే ప్రభుత్వం పట్టణీకరణ, పారిశ్రామికీకరణకు ప్రాధాన్యం ఇస్తుంది. అందులో భాగంగా క్రిస్‌సిటీ ఏర్పాటు చేస్తున్నాం. చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన ఇందులో భారీగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇది వేల కోట్ల పెట్టుబడులకు కేంద్రం కాబోతోంది" అని ప్రధాన మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ ఇప్పటికే తయారీ రంగం దూసుకుపోతోందని, ఉత్పత్తి రంగంలో దేశంలో అగ్రస్థానంలో నిలబడేలా రాష్ట్రానికి మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సెల్‌ఫోన్ల తయారీలో ప్రపంచంలోనే ఉన్నతమైన స్థానంలో భారత దేశం ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

**రైల్వే జోన్‌తో...**

విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేశామని... ప్రత్యేక జోన్ కావాలన్న ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతోందని ప్రధాని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రైల్వేజోన్ ఎంతో కీలకం. వ్యవసాయ, వ్యాపార, పర్యాటక రంగాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఏపీలో వందశాతం రైల్వే లైన్ల విద్యుదీకరణ జరిగింది. వందే భారత్ రైళ్లతోపాటు అమృత్ భారత్ సర్వీసులు రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మౌలిక సదుపాయాల విప్లవంతోపాటు మెరుగైన కనెక్టివిటీతో ఏపీ ముఖచిత్రం మారబోతోంది. ఇప్పుడు ప్రారంభించిన పనులు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడతాయి" అని ప్రధాని పేర్కొన్నారు. 'బ్లూ ఎకానమీ'ని (సముద్ర వాణిజ్యం) మిషన్ మోడ్‌లో వినియోగించుకుంటామని ప్రధాని తెలిపారు. ఏపీలో మత్సకారుల ఆదాయం పెరిగేందుకు నిబద్ధతతో పని చేస్తున్నామని అన్నారు. మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, సముద్రంలో రక్షణ కోసం చర్యలు చేపట్టామన్నారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అభివృద్ధిలో అందరినీ కలుపుకొని వెళ్తామన్నారు. "అభివృద్ధి అన్ని రంగాల్లో జరగాలి. ఫలాలు అందరికీ అందాలి. నేడు ప్రారంభించిన ప్రాజెక్టులు ఏపీ ప్రజల భవిష్యత్తు, శ్రేయస్సుకు తోడ్పాడు అందించబోతున్నాయి' అంటూ ప్రసంగాన్ని ముగించారు.

# కార్యకర్తలను పట్టించుకోండి!

ఆయన సూచన మేరకు నెల రోజుల్లో ఈ కమిటీలను వేయాలని, త్వరితగతిన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని పీఏసీ నిర్ణయించింది. ప్రతి నెలా పీఏసీ సమావేశం నిర్వహించాలన్న నిర్ణయమూ జరిగింది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లోపే ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, లేదంటే ఆ ఎన్నికలపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పీఏసీ సమావేశంలో అభిప్రాయపడ్డారు. కాగా, ఏడాదిపాటు సంవిధాన్ బచావ్ కార్యక్రమాలు తీసుకోవాలని ఇటీవల సీడబ్ల్యూసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని కేసీ వేణుగోపాల్.. పీఏసీలో వివరించారు. దీనికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అయితే ఈ నెల 26 నుంచి 28 మధ్యలో హైదరాబాద్‌లో సంవిధాన్ బచావ్ ర్యాలీని నిర్వహిస్తామని, దానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ సమయం ఇవ్వాలని పీఏసీ సభ్యులు కోరారు. దీనిపై వారిని సంప్రదిస్తానని వేణుగోపాల్ చెప్పారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో లక్షా 80 వేల మంది చనిపోయారని చెప్పారు. ఇందులో 30 వేల మంది హెల్మెట్లు ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారన్నారు. 66 శాతం ప్రమాదాల్లో బాధితులు 18 నుంచి 34 ఏళ్లలోపు వయస్కులని వివరించారు. విద్యా సంస్థల లోపలికి వెళ్లే, బయటికొచ్చే ప్రదేశాల వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల జరిగిన ప్రమాదాల్లో 10 వేల మంది పిల్లలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ బస్సులు, ఆటోల ప్రమాదాలకు కారణాలను గుర్తించామని, వాటిని నివారించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్డు భద్రత అంశంపై రాష్ట్రాల మంత్రులు, కార్యదర్శులతో చర్చించామన్నారు. భారీ వాహనాలకు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఎమర్జెన్సీ బ్రేకింగ్, డ్రైవర్ కునికిపాట్లు పడుతుంటే హెచ్చరిచే వ్యవస్థ వంటివాటిని తప్పనిసరి చేస్తామని తెలిపారు. కాగా, రోడ్డు భద్రతను పెంపొందించేందుకు కేంద్రం రూ.4,500 కోట్లతో దేశవ్యాప్తంగా డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు, ఆటోమేటెడ్ టెస్టింగ్ క్లస్లర్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

# ఇస్రో 'స్పేడెక్స్' మళ్లీ వాయిదా..

**-ఉపగ్రహాల డాకింగ్ మరింత ఆలస్యం ఇస్రో చేపట్టిన స్పేస్ డాకింగ్**



బెంగళూరు, జనవరి 8 : ఇస్రో చేపట్టిన స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్(స్పేడెక్స్)కు అవాంతరాలు ఎదురవుతున్నాయి. గురువారం అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం(డాకింగ్) చేయాలని ఇస్రో భావించింది. ఇందుకోసం రెండు ఉపగ్రహాలను 225 మీటర్ల సమీపానికి తెచ్చినప్పుడు వాటి దిశ ఊహించిన దాని కంటే కొంత తేడాగా ఉండటంతో డాకింగ్ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్టు ఇస్రో బుధవారం 'ఎక్స్'లో ప్రకటించింది. ఉపగ్రహాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. డాకింగ్ ప్రక్రియ వాయిదా పడటం ఇది రెండోసారి. మంగళవారం జరగాల్సి ఉన్న ఈ ప్రక్రియ గురువారానికి వాయిదా పడింది. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసే సామర్థ్యాన్ని అందుకునేందుకు ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా స్పేడెక్స్ ప్రయోగం చేపట్టిన సంగతి తెలిసిందే.

# విశ్వ మానవత!




విజ్ఞానం వికసించి%ొ% కట్టుబాట్లను, అడ్డుగోడలను, కుల మతాల సంకెళ్లను బద్దలు కొట్టాల్సిన చోట, కులవివక్ష కాలకూట విషంలా, కరుడుకట్టిన ఉన్మాదంలా మరుగుతోంది. కుల వ్యవస్థ హిందూ సమాజంలో వేళ్లూనుకుని వున్న పెద్ద రుగ్మత. విజ్ఞానం పెరిగేకొద్దీ అజ్ఞానం, అసమానతలు, వివక్షతలు దూరం కావాలి. అనాగరిక భావజాలాన్ని దూరం చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతతో పోటీ పడుతున్న కాలంలోనూ కుల వివక్ష వెంటాడుతోంది. ఇవి మనిషి శక్తియుక్తుల్ని, ఆత్మవిశ్వాసాన్ని నాశనంచేసే మారణాయుధాలు. అణగారిన కులాల ఉన్నతికి అతి పెద్ద అడ్డుగోడలు. 'నిమ్న జాతుల కన్నీటి నీరదములు/ పిడుగులై దేశమును కాల్చివేయున'ంటూ చాతుర్వర్ణ వ్యవస్థపై నిప్పులు చెరిగాడు జాషువా. దేశంలో కులగజ్జి నరనరానా జీర్ణించుకుపోయి వుంది. పేదరికం వెంటాడుతున్నా%ొ% అరిసే ఆకల్ని, ఎగసే డొక్కల్ని తొక్కిపెట్టి, రేయింబవళ్లు కష్టపడి ఉన్నత విద్యా సంస్థల్లో సీటు సంపాదించే వరకూ ఎదిగినా.. పేరెన్నికగన్న ఉన్నత విశ్వవిద్యాలయాలు, ముంబాయి ఐఐటీ వంటి విద్యాసంస్థల్లోనూ కులం పేరుతో దూషణలు, అవమానాలు, వేధింపులు తప్పడంలేదు. చదువులో చూపే ఆత్మవిశ్వాసం, వివక్షను ఎదుర్కోవడంలో చూపలేక ఆత్మహత్యలకు పాల్పడే విషాద సంఘటనలు అనేకం. ఈ కులవివక్ష విద్యార్థులకే కాదు%ొ%ప్రొఫెసర్ల స్థాయిలోనూ తప్పడంలేదు.

'సత్యాలను వాస్తవాల నుంచి గ్రహించాలి' అంటారు మావో సేటుంగ్. కులం కేన్సర్‌లా పట్టణాల్లోని విద్యాధికుల్లోకీ పాకింది. ఈ కులం కేన్సర్ భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు అడుగుపెట్టిన ప్రతిచోటా వ్యాపించింది. ఈ జాఢ్యం కులాల పేరుతో హాస్టళ్ల నుంచి కులసంఘాలు, మ్యాట్రిమోనియల్స్ నిర్వాహణ వరకూ వెళ్లింది. అభివృద్ధి చెందుతున్న ఆధునిక భారతదేశం ఎటువైపు పయనిస్తోంది? ఆముక్తమాల్యదలోని మాల దాసరి బతికిన మధ్యయుగాల్లోకా? శూద్ర శంభూకుని నరికివేసిన త్రేతాయుగం వైపా? ఏకలవ్యుని బొటన వేలును ఖండించుకునేలా చేసిన ద్వాపర యుగం వైపా? నిజాలు చెప్పిన లోకాయతుల గ్రంథాలను బూడిద కుప్పలుగా చేసిన రోజుల్లోకా? ఎటు పయనిస్తున్నాం? అన్నదే ప్రశ్న. మానవ వికాసం పరిఢవిల్లాల్సిన స్కూళ్లు, కాలేజీలు, యూనివర్శిటీల్లోనూ కులాల కుంపటి నిత్య అగ్నిహోత్రంలా రాజుకుంటూనే వుంది. తాజాగా%ొ% దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షను అంతమొందించేందుకు తీసుకున్న చర్యల గురించి, దేశంలోని అన్ని యూనివర్సిటీల నుంచి సమాచారాన్ని సేకరించి సమర్పించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కుల వివక్ష కారణంగా ఆత్మహత్య చేసుకున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. గతంలో జైళ్లలో ఖైదీలకు పనులు కేటాయించడంలోనూ కులవివక్ష చూపడం సరికాదని, రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం స్పష్టం చేసింది.

సాంఘిక సమానత అన్న భావం మత రాజకీయాలకు పూర్తి వ్యతిరేకం. సామాజిక అసమానతలు సహజమైనవని ప్రజలను నమ్మించేందుకు మతోన్మాదులు అనేక రూపాల్లో ప్రయత్నిస్తున్నారు. వివక్ష అనేది నయం చేయవలసిన వ్యాధి. విద్య, అవగాహన మాత్రమే దానికి విరుగుడు. పోగొట్టుకున్న హక్కులను పోరాడి నిలబెట్టుకోవాలి. కుల మత మూఢ విశ్వాసాలతో కరుడుగట్టిన మానవ మెదళ్లలో అభ్యుదయకర ఆలోచనల విత్తనాలు మొలిపించాలి. 'రక్తధారలే ఉదయతారలై/ వికసించులే ఆత్మగౌరవం' అంటారు ఓ దళిత కవి. కుల నిర్మూలన జరగనిదే, కులతత్వం నాశనం గాదు. కులతత్వం నాశనం గానిదే, భారతజాతిలో ఐకమత్యం రాదు. అంటరానితనం మంట గలవనిదే, ఒక జాతిగా మనలేము. 'అంధ కుల మత విశ్వాసాలకు సమాధి/ మానవ మేధ వికాసానికి పునాది' అంటాడో కవి. కుల మత ధర్మాల పేరిట సృష్టించిన బొమ్మజెముళ్లు, మనువాదులు కట్టిన మట్టి గోడల సరిహద్దులు విధ్వంసం కావాలి. ఆ శిథిలాల నుంచి సరికొత్త నాగరికత, మానవీయత, సమానత ఉద్భవించాలి. అప్పుడే విశ్వమానవ సమానత వర్ధిల్లుతుంది.

# ఎన్కౌంటర్ లేని రోజులు ఎప్పుడో!

ఎన్నికల్లో మారుతున్నవి రాజకీయ పార్టీల జెండాలు మాత్రమే. పాలకుల ప్రయాణం, పని విధానం ఒక్కటే. అధికార యంత్రాంగం నామమాత్రంగా మారుతున్నది గానీ వారి ఎజెండా మాత్రం ఒక్కటే. అధికారంలోకి వచ్చిన తర్వాత వారి పరిపాలన రక్షణ కోసం పోలీసులచే నిర్బంధం, లాటి చార్జీలు, అరెస్టులు, జైలులను ఆశ్ర ఇస్తున్నారు. ప్రజలను అత్యంత శక్తివంతంగా వేగవంతంగా మార్చగలిగే నక్సలైట్ల విషయంలో ప్రభుత్వాల ఎన్కౌంటర్ వైఖరిలో నూరు శాతం ఒకటే విధానం అమలు పరుస్తాయని మరో మారు రుజువైంది. కెసిఆర్ నియంత పాలన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కొలువుదీరిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏడాది ఉత్సవాలకు సిద్ధమవుతుంది. సరిగ్గా ఇదే సమయంలో ములుగు జిల్లా అడవి ప్రాంతంలో సిపిఐ ఎం.ఎల్. మావోయిస్టు పార్టీ....... ముందస్తు ప్లాన్ ప్రకారం దళం తినే అన్నంలో విష ప్రయోగంచేసి తెల్లవారుజామున పోలీసుల ఏకపక్ష కాల్పుల్లో ఏడుగురు పాశవికంగా హత్య గావించబడ్డారు. ఈ దిగ్భ్రాంతి కరమైన ఎన్కౌంటర్ పై తెలంగాణ ప్రజల నుంచి అనేకమైన ప్రశ్నలను లేవనేత్తుతున్నది. ఈరోజుది పోరాటాలకు చిరునమైన తెలంగాణ గడ్డమీద ఎన్కౌంటర్స్ లేని పరిపాలనను ఊహించలేము అనే ప్రశ్న వేధిస్తుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నక్సలైట్లే దేశభక్తులని గొప్పగా మాట్లాడిన నందమూరి తారక రామారావు, తదనంతరం అధికారంలోకి వచ్చిన వెంటనే నక్సలైట్లపై తీవ్రమైన నిర్బంధాన్ని తీసుకువచ్చారు. అనేకమంది విప్లవకారులని అంతమొందించాడు. ఆ తరువాత అధికారాన్ని ఆక్రమించిన చంద్రబాబు నాయుడు నరమాంస భక్షకుని వలే పోలీసు వ్యవస్థ ద్వారా కిరాయి హంతకముఠాల ద్వారా ప్రజాస్వామికవాదులను, హక్కుల నేతలను, విప్లవోద్యమ సానుభూతిపరులను నయీమ్ చేత ఒక చీకటి సామ్రాజ్యాన్ని ఏర్పరిచి అతి క్రూరంగా హతచేయించాడు.

ఆ క్రమంలో కామ్రేడ్ బెల్లి లలితను 17 ముక్కలుగా నరికి హత్య చేశారు. ఉద్యమకారులకు, ఉద్యమ గాయకులకు తెలంగాణ అంటే ఇదే గతి పడుతుందని ఒక హెచ్చరిక చేస్తూ నర హంతక నయీమ్ చేత బెదిరింపు చేయించిన సందర్భం నేటికీ పచ్చిగానే ఉన్నది. తెలంగాణ వాదాన్ని ఎత్తుకొని ముందు నడుస్తున్న మారోజు వీరన్నను పట్టుకొని అతి కిరాతకంగా పోలీసులచే హత్య చేయించారు. ఇలా వేలాదిమంది తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోయారు. తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, సీఎల్పీ నేతగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల సందర్భంలో నక్సలైట్లతో శాంతి చర్చలు జరుపుతామని, ఆ సమస్య చాలా సున్నితమైనదని, పరిష్కారం చూపుతామని మరోసారి నమ్మబలికాడు.



- పంతం యాకయ్య,
తెలంగాణ ఉద్యమకారుడు.

అట్లే 2004లో తెలంగాణ రాష్ట్ర సమితితో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నక్సలైట్ సమస్యను తాము శాంతి భద్రతల సమస్యగా చూస్తాలేమని ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలగా చూస్తున్నామని నొక్కి చెప్పి శాంతి చర్చలకు ఆహ్వానించాడు. శాంతి చర్చల పేర వచ్చిన సిపిఐ (ఎం.ఎల్) మావోయిస్టు, సిపిఐ (ఎం.ఎల్) జనశక్తి పార్టీల నాయకులతో చర్చలు జరుపుతూనే మరోవైపు కాల్పులకు తెగబడ్డారు. ఏడాది పాలన వేడుకలు జరుపుకుంటున్న వైయస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ, పోలీసుల చేత బూటకపు ఎన్కౌంటర్ల ద్వారా అనేక మందిని పొట్టన పెట్టుకున్నాడు. చివరికి నల్లమల అడవుల నుండి నక్సలైట్లను ఖాళీ చేశానని గొప్పలు చెప్పుకున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆ అడవిలోనే దిక్కులేని చావును ఈ సమాజం మర్చిపోలేదు.

ఇక 2001 నుంచి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిన కేసీఆర్ పౌర హక్కుల సంఘ నాయకుడిగా ఉండడం నాకిష్టం కానీ ఇప్పుడు నా ముందున్న లక్ష్యం తెలంగాణ రాష్ట్రం అని ప్రకటించుకున్నాడు. నక్సలైట్ల ఎజెండానే మా టిఆర్ఎస్ ఏజెంట్ అని పదేపదే చెప్పాడు. అనేక ఉద్యమ పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. స్వరాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో అంటే 2014లో తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా కొలువుతీరాడు. బాధ్యతలు చేపట్టిన వెంటనే కేసీఆర్ విప్లవోద్యం పైన ఉక్కు పాదం మోపుతూ కామ్రేడ్ శృతి, కామ్రేడ్ సాగర్ లను ఎన్కౌంటర్ గావించి నక్సలైట్లపై తన నైజాన్ని బహిర్గతం చేశాడు. తరువాత ఖమ్మం వరంగల్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలలో సిపిఐ (ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి బాట పేరుతో నక్సల్స్ తిరుగుతున్నారని పసిగట్టి, తిష్ట వేసి 9 మందిని పట్టుకొని అతి కిరాతకంగా హత్య చేయించాడు. 2009లో తెలంగాణ కై కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షను భగ్నంచేసి హైదరాబాద్ నుంచి ఖమ్మంకు తరలించినప్పుడు వీరోచితంగా పోరాడి కెసిఆర్ ను కాపాడినది సిపిఐ (ఎం. ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ. అది మరిచిపోయిన కెసిఆర్ ఆ పార్టీకి చెందిన దళ నాయకుడు కామ్రేడ్ లింగన్నను అతి కిరాతకంగా పట్టుకొని కాల్చి చంపారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న న్యూ డెమోక్రసీ దళాలను అరెస్టులతో, నిర్బంధంతో నిర్వీర్యం చేశారు. పౌరహక్కుల సంఘ నేతగా ఉంటానన్న కేసీఆర్ చివరకు తెలంగాణలో ధర్నా చౌక్ లేకుండా చేసే చేసేవరకు పరిణితి చెందాడు. అనేకమంది విప్లవ సానుభూతిపరులపై భయభ్రాంతులకు గురిచేస్తూ %చీఆూ% దాడులు చేస్తున్నప్పుడు వారికి గొప్పగా సహకరించిన మహా ముఖ్యమంత్రిగా కేసీఆర్ పేరు పొందాడు. ప్రో// హరగోపాల్, ప్రో// కోదండరాం, మందకృష్ణ మాదిగ, చెరుకు సుధాకర్, ప్రొఫెసర్ కాసిం, అరుణోదయ విమలక్క లాంటివాళ్ళ పైన అక్రమ కేసులు పెట్టి, ఇబ్బంది పెట్టినతీరును, టిఆర్ఎస్ పని విధానాన్ని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేరు. కెసిఆర్ నియంతృత్వ పాలనలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో నక్సలైట్లు ఉంటే బాగుండు అని మాట్లాడి విప్లవోద్యమ సానుభూతిని పొందాడు. మొత్తంగా మళ్ళీ తెలంగాణలో కాంగ్రెస్ పాలన వొచ్చింది. ఇప్పుడున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒకవైపు ఏడాదిపాలన ఉత్సవాలు జరపమంటూ మరొకవైపు తెలంగాణ ప్రాంతంలోని ములుగు జిల్లా అడవి ప్రాంతంలో అన్నంలో విషంపెట్టి పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి అతి దగ్గర నుంచి కాల్చి చంపారు. వారి మృత దేహాలపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని, చేతులు మరియు కాళ్లు ఇరిగి ఉన్నాయని, దవడ భాగం మొత్తం లేకుండా ఉందని మృతుల కుటుంబాలు విలపిస్తున్నాయి. పాలకులు ప్రజల కోసం పోరాడే అన్నలను చంపుతున్నారనేది వాస్తవం. ప్రజా పోరాటాలు చేస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతూ వేధిస్తున్న సందర్భాలు మన కండ్ల ముందు ఉన్న సత్యాలు. ఈ ఎన్కౌంటర్లన్నీ అడవి అక్కగా ఉన్న సీతక్క ప్రాంతంలో జరగడం గమనార్హం. అందుకే రాజు మారిన రాజ్యం స్వభావం మారదు. పాలించేవారు మారినంత మాత్రాన ప్రజల బతుకులు మారవు. మారుతున్నయి జెండాలు తప్ప పాలకుల ప్రయాణం ఒక్కటే. తస్మాత్ జాగ్రత్త ప్రజలారా .

ఇట్లు
మీ పంతం యాకయ్య
తెలంగాణ ఉద్యమకారుడు

# ఎస్సీ వర్గీకరణ పోరులో మనువాదు,చేతుల్లో,కీలుబొమ్మగా మారినా మంద కృష్ణ

**-అంబేద్కర్ ని,కించపరిచిన,బిజెపి పార్టీ నేతలకు కీలుబొమ్మగా మారడు**
**-అంబేద్కర్ ఆరోజుల్లోనే చెప్పాడు హక్కులు అడుక్కుంటే రావు పోరాడితే వస్తాయని ఆ విషయాన్ని మరిచిన మందకృష్ణ మాదిగ**
**-మనువాదుల చేతుల్లో కీలుబొమ్మగా మారుతున్నాడని ఎద్దేవా చేసిన మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, మాదిగ జెఏసి నాయకులు మొలకల నరేష్,**

మహబూబాద్ టౌన్ తెలంగాణ సేన జనవరి 8



బుధవారం రోజున మహబూబాబాద్ పట్టణంలో ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన పాత్రికేయ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి మాట్లాడుతూ... మూడు దశాబ్దాల కాలంగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కొనసాగుతుందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాడు అమలు చేయబడిన ఎస్సీ వర్గీకరణ నేడు తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు వర్తింపజేసి అన్యాయం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. తెలంగాణ జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కావాలని న్యాయమైన డిమాండ్ తో గత 11,సంవత్సరాలుగా,విద్యార్థులు, యువకులు, మేధావులతో మాదిగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో ఉద్యమం నడుస్తోందని తెలిపారు. పార్లమెంట్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు న్యాయం చేస్తానని ప్రధాని నరేంద్ర మోడీ 2024 తెలంగాణ రాష్ట్ర పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో మాదిగల ఓటు,బ్యాంకు,దండుకోవడానికి పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన బహిరంగసభలో వర్గీకరణ తానే చేస్తానని బూటకపు హామీ ఇచ్చి పార్లమెంట్లో చట్టం చేయకుండా,బీజేపీ,మాదిగలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఏ ఒక్క అగ్రవర్ణ నాయకుడు ఉద్యమం చేయకుండానే 2శాతం జనాభా లేని అగ్రవర్ణాల వారికి బిజెపి అగ్రవర్ణ పేదల పేరుతో 10% రిజర్వేషన్లు కల్పించి పార్లమెంట్లో చట్టం చేసిందని విమర్శించారు. అటువంటి మనువాద బిజెపి పార్టీకి ఎమ్మార్పీఎస్ అగ్ర నాయకుడు మద్దతు తెలిపి మాదిగ ఓట్లు వేయించడం, అంటకాగడం దారుణం అన్నారు. మాదిగలు, మాదిగ మేధావులు, రాజకీయ విశ్లేషకులు ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 1, 2024న ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే తెలంగాణ రాష్ట్రంలో మాదిగలు నరేంద్ర మోడీకి పాలాభిషేకం చేయడం మాదిగ సమాజం,జీర్ణించుకోలేకపోతుందన్నారు. మాదిగల పక్షపాతిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ 1997లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్, అదేవిధంగా 2008లో జస్టిస్ ఉషా మెహరా కమిషన్ ను వేసి ఎస్సీ వర్గీకరణపై సమగ్ర నివేదిక తీసుకున్నదన్నారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారంలో చేవెళ్ల డిక్లరేషన్ లో ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అధికారంలోకి రాగానే చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు కార్యచరణ సిద్ధం చేస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం వేశారన్నారు. తదనంతరం రాష్ట్రస్థాయి నివేదిక కోసం హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ తో ఏకసభ్య కమిషన్ వేసి సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలకు మద్దతుగా నిలుస్తూనే అనేక సభల్లో, సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించడం మాదిగల ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు..అలాగే సమగ్ర కుటుంబ సర్వే 2024 జనాభా లెక్కల ఆధారంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని, ఎస్సీ వర్గీకరణను జిల్లాల వారీగా అమలు చేయాలని ప్రధాన డిమాండ్ గా ఫిబ్రవరి 2, 2025న మాదిగ సంఘాల ఐకాస, విద్యార్థి, యువజన సంఘం ఆధ్వర్యంలో మాదిగ విద్యార్థి యువగర్జన సభను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో నిర్వహించబోతున్నామని అన్నారు. దానికి మాదిగ విద్యార్థి, యువజన, ప్రజా సంఘ మేధావులు, కవులు, కళాకారులు మహబూబాబాద్ జిల్లా నుండి వేలాదిగా హాజరై మాదిగ విద్యార్థి యువగర్జనను విజయవంతం చేయాలని కోరారు సమావేశంలో మాదిగ జె ఏ సి నాయకులు మొలకల నరేష్,దర్శనం రామకృష్ణ,ఇనుగుర్తి సుధాకర్,పోలేపాక వెంకన్న,కంపాటి ఉప్పలయ్య,హెచ్చు నాగరాజు ,శ్రీధర్,స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అక్షర ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ బహూకరణ

**శాలిగౌరారం:**

నకిరేకల్ అక్షర స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ దాత రేపాల మదన్ మోహన్ సహకారంతో శాలిగౌరారం మండలం మాదారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల కోసం 10 వేలు విలువ చేసే స్పోర్ట్స్ కిట్ ను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్షర స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ చైర్మన్ రేపాల సతీష్ పాఠశాల ఉపాధ్యాయులు పున్న శ్రీనివాస్ ,దేవులపల్లి రామ్మూర్తి, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ




ఏడాది నుండి అక్షర స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విస్తృతమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండర్ చైర్మన్ తెలిపారు

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

లింగాల గణపురం మండలంలో వివిధ గ్రామాలకు అశ్వరావు రిజర్వాయర్ నుండి లింగాల గణపురం మండలంలోని కళ్లెం, లింగాల గణపురం , నాగారం, మాణిక్యపురం గ్రామాలకు ఈరోజు రిజర్వాయర్ నుండి నీరు విడుదల చేయడం జరిగింది ఈ విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలందరూ గ్రామాల నుండి కెనాల్ కాల్వ వద్ద ఉండి ఆ నీరుని చూసి గ్రామ ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు



ఇలా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కడియం శ్రీహరి ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు కూడా తెలియజేయడం జరిగింది.

తెలంగాణ సేన
గురువారం,09, జనవరి, 2025

# నిషేధిత చైనా మాంజా ను అమ్మిన, వినియోగించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు

**- కొత్తగూడ ఎఫ్ ఆర్ ఓ వజహత్.**


కొత్తగూడ తెలంగాణ సేన

ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడ రేంజ్ ఆఫీసర్ వజహత్ పేర్కొన్నారు...
బుధవారం నాడు మండల కేంద్రంలో అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో చైనా మాంజా విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడ రేంజ్ ఆఫీసర్ వజహత్ మాట్లాడుతూ చైనా మంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా మాంజా తో తలెత్తే అనర్థాల పై అందరికి అవగాహన కలిగి ఉండాలని , నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని అన్నారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని అన్నారు. ఈ యొక్క చైనా మాంజా ను అమ్మినా, రవాణా చేసినా సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్ లకు గాని డయల్ 100 గాని ఫోన్ చేసి తెలపాలి అని సూచించారు.. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ రాజేష్, బీట్ ఆఫీసర్లు అశోక్, రాకేష్, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు...

# భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ 12 వేల రూపాయలు ఇవ్వాలి

**-లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలి**
**-విధివిధానాలు ప్రకటించాలి**
**-ఎవరెవరికి ఎలా ఇస్తారనే దానిపై స్పష్టతివ్వాలి**
**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించినా రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్**



సూర్యాపేట:భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ 12 వేల రూపాయలు వెంటనే విడుదల చేయాలని, అందుకు అన్ని సంఘాలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ములకలపల్లి రాములు పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేటజిల్లా కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులు-పాలకుల వాగ్దానాలు-సంక్షేమ పథకాల అమలు అనే అంశంపైనిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొనిమాట్లాడుతూభూమిలేని వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ జాబ్ కార్డు ద్వారా 100 రోజులు పని పొందిన కుటుంబాల ఆధార కార్డు, పట్టాదారు పాస్ బుక్ ఆధారంగా రూ. 12 వేల పథకానికి ఎంపిక చేయబోతున్నట్టుగా వార్తలోస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. లబ్ధిదారులను కుదించేందుకు కుట్ర జరుగుతుందన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే విధివిధానాల రూపకల్పనకు వ్యవసాయ కార్మిక సంఘాలతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు కలిగిన వారితోపాటు వలస కార్మికులను, కూలి పని చేసుకుని బతికే పేదలందరినీ అర్హులుగా ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కొత్తగా జాబ్ కార్డులిచ్చి పనిదినాలు కల్పించాలని కోరిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులలో జాబ్ కార్డు పేరుతో ఆన్లైన్ పేరుతో 12 వేల రూపాయల పథకాన్ని కుదించి లబ్ధిదారులను తగ్గించాలని చూస్తున్నారని అన్నారు. ఇలాంటి విధానాలు ప్రభుత్వం విరమించుకొని గ్రామ గ్రామాన భూమిలేని పేదలను గుర్తించాలని, ఐదు పది గుంటలు భూమి ఉన్న పేదలను కూడా ఈ పథకానికి అర్హులుగా తీసుకోవాలని, ప్రభుత్వము ఎకరం లోపు భూమి ఇచ్చి ఆ భూమిలో పంట పండడానికి అవకాశం లేకుంటే వారికికూడా 12 వేల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 12 వేల రూపాయల సాధన కోసం రానున్న కాలంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తీసుకోవు పోరాటాల్లో అందరం ముందు ఉంటామని తెలియజేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు (ఎం సిపిఐ)వరికుప్పల వెంకన్న, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, పిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు, బహుజన మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులు నారా బోయిన వెంకట యాదవ్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, ఏసి టీ యు జిల్లా నాయకులు నజీర్, సీ యు సీ జిల్లా నాయకులు కరీం,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్, సిఐటియు జిల్లా నాయకులు వల్లపు దాసు సాయికుమార్, ఐద్వా జిల్లా నాయకురాలు మేకన పోయిన సైదమ్మ, పిండిగా నాగమణి, పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు పోలేబో పోయిన కిరణ్ , ప్రైవేటు టీచర్ల సంఘం జిల్లా కార్యదర్శి జె ,నరసింహారావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోసనబోయిన హుస్సేన్, సోమపంగా జానయ్య, ఆరే రామకృష్ణారెడ్డి, జంపాల స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో మౌన నిరసన

**-మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో మౌన నిరసన కార్యక్రమం**
**-కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్**




**అందోల్, తెలంగాణ సేన న్యూస్ :**
అందోల్ నియోజకవర్గం కేంద్రం జోగిపేట పట్టణంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్రగా వెళ్లి నల్ల బ్యాడ్జీలతో మౌన నిరసన కార్యక్రమం చేపట్టి అంబేద్కర్ విగ్రహంకి వినతిపత్రం అందించడం జరిగింది అనంతరం మాజీ ఎమ్మెల్యే గారు క్రాంతికిరణ్ గారు మీడియాతో మాట్లాడిన ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలు పేరుతో రైతన్నకు రైతు భరోసా 15,000 వేల రూపాయలు మరియు దళిత బంధు 12 లక్షలు%ు% వికలాంగుల పెన్షన్ 6000 కళ్యాణ్ లక్ష్మిలో తులం బంగారం తో పాటు ఇలా ఇచ్చినటువంటి ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అలాగే రైతులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# పుట్టినరోజు వేడుకలకు విచ్చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు




**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్**
తాడ్వాయి : మండలం మేడారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గారైన చిడం బాబురావు గారి మనవడి( వేదాన్ష్ )మొదటి పుట్టినరోజు, కేశఖండన మహోత్సవ వేడుకకు హాజరై ఆశీర్వదించిన ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న, పలు నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నరసింహ నాయక్, మలిదశ ఉద్యమకారుడు అజ్మీర సురేష్, వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ జిల్లా అధ్యక్షులు కన్నెబోయిన విక్రమ్ యాదవ్, ములుగు రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి చెక్కులు ఇవ్వాలంటూ సిపిఎం ఆందోళన



**జూబ్లీహిల్స్, తెలంగాణ సేన :**
బోరబండ డివిజన్ ,సైట్ -3,లోని బ్రాహ్మణవాడి బస్తీ లోని ప్రధాన రహదారిలో,కళ్యాణ లక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసి ఒక సంవత్సరం దాటి నా కూడా పిల్లలు పుట్టి నాలుగు నెలలు అవుతున్న ఇంతవరకు కళ్యాణ లక్ష్మి చెక్కులు రాలేదని,సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పుట్టిన చంటి బిడ్డల తోటి,రోడ్డు మీద నిరసన తెలియజేస్తున్న అప్లై దారులు, వాళ్ల తల్లిదండ్రులు. ఈ సందర్భముగా సిపిఎం పార్టీ నాయకులు టి సాయి శేష గిరి రావు మాట్లాడుతూ ,పెళ్లయి పిల్లలు పుట్టి సంవత్సరం పైనే దాటుతున్న ఇంతవర కు కళ్యాణ లక్ష్మి చెక్కులు వీరికి అందకపోవటం ,ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని, వెబ్సైట్లో పరిశీలిస్తే ఆరు నెలల క్రితమే వీరికి ,ఆర్డిఓ ,పి.డి, అకౌంట్లో డబ్బులు జమ చేసిన విషయం కనపడుతుందని ,కానీ ఇంతవరకు చేతికి చెక్కులు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు.ఎమ్మెల్యే సంతకం పెట్ట డం లో ఆలస్యమైందా, లేకపోతే అధికారుల దగ్గర ఆలస్యమైందా ,జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ,ఇటువంటి విషయాలు, పరి పాలించే ప్రభుత్వం మీద చెడు పేరు తెచ్చే అవకాశం ఉ ంటుందని, తులం బంగారం కూడా వస్తుందని ఆశపడ్డారని తులం బంగారం మాట అటు నుంచి రెగ్యులర్గా వచ్చే చెక్కులు కూడా రావటంలో ఆలస్యం అవుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అప్లై చేసుకున్న లబ్ధిదారులందరికీ తప్పనిసరిగా తులం బంగారం తో కలిపి కళ్యాణ లక్ష్మి చెక్కులు ఇస్తానన్న ప్రభుత్వ వాగ్దానాలు నెరవేర్చుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే వీరికి కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేయాలని లేదంటే దరఖాస్తు చేసుకున్న ప్రజల తో కలిసి కలెక్టర్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున పోరాటం చేయటానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోహన్ రాథోడ్, శివమ్మ ,మీరా ,గోపాల్, గమ్మి బాయ్ , సునీత, మోహన్ నాయక్, రుక్మిణి బాయి, సరోజా, లఖన్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్..



**కంటోన్మెంట్ తెలంగాణ సేన న్యూస్ 8:**
మోండా డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రూపొందించిన నూతన సంవత్సర క్యాలండర్ ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినారు. అనంతరం శ్రీ పాండు రంగా విఠలేశ్వర వేంకటాద్రి స్వామి దేవాలయం శ్రీ గోదా కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో సత్యనారాయణ నాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబురావు, అల్లాడి గౌరీ శంకర్ ,నందికంటి రవి తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో రాణిస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు




**ములుగు జిల్లా ప్రతినిధి: తెలంగాణ సేన న్యూస్**
ఏటూరునాగారం లోని చిన్నబోయినపల్లి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో ఆశ్రమ పాఠశాల విద్యారులు ప్రతిభ కనబర్చి రాణిస్తున్నారని చిన్నబోయిన పల్లి అశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడే నాగేశ్వర్ అన్నారు. ములుగు జిల్లా చిన్నబోయిన పల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న సీహెచ్.మాసయ 7వ తరగతి విద్యార్థి స్కూల్ ఆఫ్ గేమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ టీం తరుపున జాతీయ స్థాయి ఆండర్ 14 విభాగంలో ఖోఖో క్రీడలో ఈ నెల 10 తేది నుండి12 వరకు మహరాష్ట్రలో ఆడనున్నట్లు తెలిపారు. అలాగే యం.రవి 9వ తరగతి విద్యార్థి ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఖోఖో సభ్ జూనియర్స్ జాతీయ స్థాయి క్రీడలలో 30,31 తేది నుండి జనవరి 1వ తేది వరకు జార?ండ్ రాష్ట్రంలో ఆడాడని, యం. ఆదిత్య 10 తరగతి విద్యార్థి ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఖోఖో జూనియర్ అండర్-18 విభాగంలో మహబూబ్ నగర్ లో 28.29.30 అక్టోబర్ 2024 లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడలలో అడాడని, అలాగే యం. ఉమేష్ 9వ తరగతి విద్యార్థి, యం.చింటూ, 7వ తరగతి విద్యార్థి అండర్-14 సభ్ జూనియర్స్ విభాగంలో కొల్లాపూర్ లో 28,29 డిసెంబర్ నెలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడలలో అడారన్నారు. ఈ క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్ధులను పీజీహెచ్ ఏం. మడే నాగేశ్వర్ రావు, డిప్యూటి వార్డెన్ రాజారాం, పీజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు.పీఈటీ రమేష్, తదితర ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్ధులు అభినందించారు.

# అశ్విక్ రామ్ ను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామనికి చెందిన ప్రముఖ వైద్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీలం శంకర్ మనువడు అశ్విక్ రామ్ మొదటి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని బుధవారం సీఎం ఆర్ ఫంక్షన్ హల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అశ్విక్ రామ్ ను పిఎసిఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి,డిసిసి ఉపాధ్యక్షులు అన్నేబోయిన సుధాకర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ ఆశీర్వదించారు. అశ్విక్ రామ్ ఆయురారోగ్యాలతో ఉండాలని, ఉన్నంత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఊట్కూరు గ్రామ శాఖ అధ్యక్షులు కుర్ర లింగయ్య,నాయకులు గోదల వెంకట్ రెడ్డి, షేక్ జహంగీర్, పాకాల సతీష్,సోమయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సహాయం



**ములుగు జిల్లా ప్రతినిధి: తెలంగాణ సేన న్యూస్**
ములుగు జిల్లా మంగపేట మండలం, కమలాపురం గ్రామానికి చెందిన భూక్య విగ్నేశ్వర్ అని చిన్నారికి ప్లేట్ లెట్స్ పడిపోయాయి. వారి కుటుంబ సభ్యులు అబ్బాయిని మొదట హన్మకొండలోని అమృత హాస్పిటల్ తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు సీరియస్ గా ఉందని చెప్పగా అక్కడినుంచి హైదరాబాద్ లోని లిటిల్ స్టార్స్ అండ్ షీ హాస్పిటల్ కు తీసుకెళ్లారు. వీరు చాలా పేదవారు.ఇప్పటికే చాలా డబ్బులు ఖర్చు అయ్యాయి. వారి దగ్గర డబ్బులు లేక చాలా ఇబ్బందులు పడుతూ దాతల సహాయం కోరగా యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ కీలక సభ్యుడు , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ సేవ్ ద లైఫ్ ఫౌండేషన్ సభ్యులు మరియు దాతల సహాయంతో వాట్సాప్ ద్వారా సేకరించిన అమౌంట్ మొత్తము 6200 రూపాయల ఆర్థిక సహాయం ఈరోజు భూక్య విగ్నేశ్వర్ కుటుంబ సభ్యులకు కోడెల నరేష్ (జ్వాలా చారిటబుల్ ట్రస్ట్) ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో గని రాజు, చిర్రా శివకుమార్, పోశాల దేశ్ ముఖ్, ఐలోని రాము,కప్ప ముకుందం, కొండపర్తి నగేష్, బండపల్లి రవి, సయ్యద్ బాబా, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , గజ్జెల సుహాన్సి , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవికుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెల్లి కార్తిక్, గార్లు పాల్గొనడం జరిగింది.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం

**-ఎస్సై సైదులు**




**శాలిగౌరారం జనవరి 8.**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని శాలిగౌరారం ఎస్ ఐ డి. సైదులు అన్నారు. శాలిగౌరారం మండలం మాదారం ప్రాథమిక పాఠశాలలో శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సీనియర్ లీడర్ రేపాల మదన్ మోహన్ సహకారం తో విద్యార్థులకు ఎస్ ఐ సైదులు స్పోర్ట్స్ కిట్స్ ను అందజేశారు. ఈ సందర్బంగా ఎస్ ఐ సైదులు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు,మొబైల్, టీవీ సీరియళ్లకు బానిసకావొద్దన్నారు. మద్యం, మారక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమ శిక్షణ తో చదువు కొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పున్న శ్రీనివాస్, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యనారాయణ, మెంబర్స్ గుండ్ల రామ్మూర్తి, దామెర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు,డి. రామ్మూర్తి,పిఈటి మయూబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## లైబ్రరీ మెటీరియల్ కావాలని వినతి పత్రం అందించిన మండల కాంగ్రెస్ నాయకులు



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్**

బుధవారం రోజునా ములుగు జిల్లా గ్రంధాలయలలా కార్యాలయంలో జిల్లా గ్రంధాలయాల సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ ని కన్నాయిగూడెం మండలంలో బుట్టాయిగూడెం గ్రామంలో ఉన్నటువంటి గ్రంధాలయలా బిల్డింగ్ లో లైబ్రరీ మెటీరియల్ కావాలని కోరిన కన్నాయిగూడెం మండల ఇంచార్జి జాడి రాంబాబు దీనికి కాను పైడాకుల అశోక్, జిల్లా గ్రంధాలయల చైర్మన్ రవి చందర్, స్పందించి తప్పకుండా మంత్రి సీతక్క గారి దృష్టికి తీసుకువెళ్లి బుట్టాయిగూడెంలో ఉన్నటువంటి గ్రంధాలయ బిల్డింగ్ దానికి కావలిసిన లైబ్రరీ మెటీరియల్ ఏర్పాటు చేసి దానికి ఇంచార్జి ని నియమిద్దాం అని పూర్తి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ, ఇస్సార్ ఖాన్, యూత్ కాంగ్రేస్ నియోజకవర్గ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి, కన్నాయిగూడెం మండలం కాంగ్రేస్ సీనియర్ నాయకులు కావిరి రాంబాబు, కంచె రమేష్ మరియు జిల్లా కాంగ్రేస్ నాయకులు యూత్ కాంగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆజం జాహి మిల్లు భూముల విషయమై జ్యూడిషల్ ఎంక్వయిరీ జరుపాలి

**-ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ**

**వరంగల్, తెలంగాణ సేన:**

వరంగల్ జిల్లా కలెక్టర్ ని వరంగల్ ఆజం జాహి మిల్లు భూముల విషయమై జ్యూడిషల్ ఎంక్వయిరీ జరపాలని కోరుతూ మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ ఆజం జాహి మిల్లు కార్మిక భవనాన్ని కూల్చి స్థానిక వస్త్ర వ్యాపారి వ్యాపార భవన సముదాయాన్ని నిర్మించడానికి మరొకసారి ప్రయత్నం వరంగల్ నగర వాసులను విస్మయానికి గురిచేసిందని తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కూరపాటి వెంకట్ నారాయణ అన్నారు. పదివేల మంది కార్మికులకు ఉపాధి ఆదాలను కల్పించిన వరంగల్ పట్టణానికి ప్రతిష్టాత్మకమైన మీల్లును మూసివేయడమే కాకుండా భూములను అమ్మి వేయడం చివరికి కార్మికుల భవన భూమిని కూడా అన్యాక్రాంతం కావడం వరంగల్ నగర ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నని వరంగల్ నగర పౌర సమాజం పక్షాన సీనియర్ సిటిజన్స్ మేధావులు అడ్వకేట్స్ ప్రజాసంఘాల ప్రతినిధులు ఈరోజు వరంగల్ జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ మరియు ప్రజల భూములు అన్యాక్రాంతం కావడం కబ్జాకు గురి చేయడం నిరంతరాయంగా కొనసాగడం వరంగల్ ప్రజలను మరింత ఆందోళనకు గురి చేస్తున్నదని పౌర సమాజం ఆందోళన చెందుతున్నది. ఇప్పటికైనా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వరంగల్



భూములను కాపాడడానికి ముఖ్యంగా ఆజం జాహి మిల్లు మొత్తం భూములను గురించిన సమగ్ర సర్వే చేసి వివిధ సంస్థలకు అమ్మిన భూములు పొగ మిగిలిన భూముల వివరాలు వరంగల్ నగర ప్రజల ముందు పెట్టాలని కోరుతున్నారు. ర్యాంకీ, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, హౌసింగ్ బోర్డు మరియు ఇతర సంస్థలు ఎంత భూమిని కొనుగోలు చేశాయి, ఇంకా మిగిలిన భూమి ఎవరి ఆధీనంలో ఉన్నది ప్రజాస్వామ్యంలో ప్రజలకు తెలవవలసిన అవసరం ఉందని ముఖ్యమంత్రిని కోరడం జరిగింది. వరంగల్ తూర్పు నగరం ప్రజల అభివృద్ధికి అజం జాహి మిగులు భూములు ఎంతో ఉపయోగపడతాయని వరంగల్ సివిల్ సొసైటీ భావిస్తున్నదని ముఖ్యమంత్రికి సమర్పించిన మెమోరండంలో విన్నవించడం జరిగింది. కార్మిక భవనానికి సంబంధించిన భూమి ఇతరులకు అక్రమంగా చెందడంలో సహకరించిన అధికారులు, అనధికారుల వివరాలు బయట పెట్టవలసిందిగా వరంగల్ ప్రజలు, నగర సివిల్ సొసైటీ కోరుతున్నది. వరంగల్ తూర్పు నగరంలో ఇప్పటికే ప్రజా ఉపయోగం కొరకు భూమి కొరతగా ఉన్న సందర్భంలో ఆజం జాహీ మిల్లు మిగులు భూములనైన కార్మిక సమాజానికి,ప్రజలకు దక్కే విధంగా ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు కాపాడవలసిందిగా కోరుతున్నారు. అదేవిధంగా ఆజం జాహి కార్మిక భవన భూమిని మిల్లు స్మారక భవనాన్ని నిర్మించవలసిన కనీస బాధ్యత ప్రస్తుత ప్రభుత్వం పై ఉందని సివిల్ సొసైటీ సభ్యులు ముఖ్యమంత్రి ని కోరడం జరిగిందని అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ గారికి మెమోరండం సమర్పించి సంబంధిత విషయాల గురించి మాట్లాడిన వారిలో ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ , పుల్లూరు సుధాకర్, సోమ రామమూర్తి, వీరమల్ల బాబురావు, కొండ్రెడ్డి మల్లారెడ్డి,, పెండ్లి ఉపేందర్ రెడ్డి , మహమ్మద్ బాసు, చందుపట్ల శ్రీలత రెడ్డి,సోమిడి శ్రీనివాస్ , జెండా అంబయ్య ఉన్నారు. ఆజం జాహీ మిల్లు కార్మికుల భవనానికి సంబంధించిన భూమిని కాపాడాలని మిగులు భూములను రక్షించాలని వరంగల్ జిల్లా మంత్రులకు ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు కూడా ఈ వినతి పత్రాలను సమర్పిస్తున్నట్లు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ పత్రికా విలేఖరులకు తెలియజేశారు.

# ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు

**-ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు**

**-ఏటూరు నాగారం ఎస్ఐ తాజుద్దీన్**

**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్**

ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్. ఏటూర్ నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ. ఆదేశాల మేరకు సీఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు రోడ్డు భద్రత నియమాల పై వాహనదారులకు అవగాహన కల్పించడం జరిగింది. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు. పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఏటూరు నాగారం ఎస్ఐ తాజుద్దీన్ తెలిపారు. బుదవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం సమీపంలో రోడ్డు భద్రతా పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఎస్ఐ తాజుద్దీన్ పాల్గొని మాట్లా డారు. పరిమితికి మించి జనాన్ని ఎక్కించి రవాణా చేసినట్లయితే చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించి అధికారులకు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరు ఎలిమెంట్ ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పు అని హెచ్చరించారు. ...సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ప్రజలు సైబర్ క్రైమ్ నేరాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. బుధవారం సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ వాట్సప్ గ్రూపులల్లో వచ్చేటువంటి లింకులను ఓపెన్




చేయకూడదన్నారు. ఎవరైనా ఫోన్లు చేసి తమ వ్యక్తిగత బ్యాంకు ఎటిఎం సంబంధిత వివరాలు అడిగితే సమాచారం తెలుపవద్దన్నారు. ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యుల మాదిరిగానే ఫోన్ చేసి డబ్బులు పంపించామని మోసాల కు పాల్పడే అవకాశం ఉంది అప్రమత్తంగా వ్యవహరించాలి. వాస్తవము అని ధ్రువీకరించుకున్న తర్వాతనే దూరంలో ఉన్న మీ కుటుంబ సభ్యులకు డబ్బులు పంపించుకోవాలి. సైబర్ నేరగాళ్ల ఊబిలో పడి మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెండ్ ఎస్సైలు సాయి కృష్ణ. మధుకర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ హత్య పిరికి పందల చర్య

## - దోషులను కఠినంగా శిక్షించాలి

**–తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ మెంతెన సంజీవరావు**

**హైదరాబాద్, తెలంగాణ సేన :**

జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ హత్య పిరికి పందల చర్య అని, దోషులను కఠినంగా శిక్షించాలి అని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. వాస్తవాలను వెలికి తీసే జర్నలిస్టులను హత్యాలతో, భౌతిక దాడులతో భయభ్రాంతులకు గురి చేయాలను కోవడం అవినీతిపరుల అవివేకమే అవుతుంది తప్ప, హత్యలు, భౌతిక దాడులకు జర్నలిస్టులు భయపడరనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తుఏరగాలని ప్రభుత్వ యంత్రాంగంలో భాగమైన అవినీతి కాంట్రాక్టర్ల తీరును, వారికి కాపలా కాస్తున్న ప్రభుత్వ యంత్రాంగంను తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తూ దోషులకు కఠినంగా శిక్షించాల్సిందిగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ హత్యను తెలంగాణ ప్రజా ఫ్రంట్ తీవ్రంగా ఖండించింది. ఈ దారుణంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. హత్య వ్యవహారంలో విచారణను వేగవంతం చేసేందుకు కాలపరిమితి విధించాలని, హంతకులను చట్ట ప్రకారం శిక్షించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ మెంతన సంజీవరావు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై పెరుగుతున్న దాడుల మీద ఆందోళన వ్యక్తం చేశారు. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న జరల్నిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు. ముకేశ్ చంద్రకర్ కుటుంబానికి తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కాగా, ముకేశ్ చంద్రకర్ (31) ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. అవినీతి, గిరిజన సమస్యలపై వార్తలు రాశారు. యూట్యూబ్ ఛానల్ 'బస్తర్ జంక్షన్'ను నడుపుతూ బహుళ ప్రాచుర్యం పొందారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆచూకీ లేని చంద్రకర్ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ముకేశ్ చంద్రకర్ హత్యను , అవినీతి వెలికి తీసే జర్నలిస్టులను చంపడం పిరికిపందల చర్య అని, ఇలాంటి చర్యలకు నిజాయితీ గల జర్నలిస్టులు ఎవరు భయపడరని ఈ హత్యను ను తీవ్రంగా ఖండిస్తూ దోషులకు కఠినంగా శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

# శాంతి భద్రతలు పరిరక్షించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడో విఫలం అయ్యింది: బీజేపీ జిల్లా కార్యదర్శి చిలివేరు దుర్గయ్య

**మునుగోడు నియోజకవర్గం**

బీజేపీ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయం పైన కాంగ్రెస్ గూండాలు, రౌడీల్లాగా వ్యవహరిస్తూ రాళ్లతో, కర్రలతో చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ నల్లగొండ జిల్లా, ఘట్టుప్పల మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శిలు కొంగరీ నరహరి గారు, నాగులగొని శ్రీనివాస్ గారు ఆధ్వర్యంలో బస్ స్టాండ్ నందు నిరసన తెలపడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు చిలివేరు దుర్గయ్య మరియు కంపే దుర్గయ్య పాల్గొని మాట్లాడుతూ శాంతి భద్రతలు పరిరక్షించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడో విఫలం అయ్యిందని , బీజేపీ సహనాన్ని అసమర్థతగా భావించొద్దు , మేం హింసా రాజకీయాలను ప్రోత్సహించ అని అన్నారు. అలాగని మాపై దాడులు చేస్తే సహిం చంబోమని ఇలాంటి దాడులను ఆపకపోతే ఆ తర్వాత తలెత్తే పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంతాల బ్రహ్మయ్య, నర్రా పరమేష్, మాదగని రాజు, వరకాల నరసింహ, కొంగారీ పాండు, వీరమల్ల రాజు, మాదగాని భిక్షం, చెరుపల్లి ప్రవీణ్, ఎలె మారయ్య, మోదుగు తిరుమల రెడ్డి, గుఱ్ఱం శ్రీనివాస్, ఈడం రాజు, కౌడగాని శేఖర్, గుఱ్ఱం ప్రదీప్ కుమార్, మండల శ్రవణ్, ఇంగిలి ప్రవీణ్ కార్యకర్తలు అందరు పాల్గొన్నారు..



# మహిళలకు పురుషులు అంటే భరోసా ఉండాలి

**-ప్రసాద్ లాబ్స్ లో పాటను లాంచ్ చేసిన మంత్రి సీతక్క**



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్:**

సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు రూపుమాపాలని మంచి ఉద్దేశంతో అలీ, రమణారెడ్డి మంచి పాటను నిర్మించారని మంత్రి సీతక్క అన్నారు. నవ్వులతో అందరిని ఆరోగ్యంగా ఉంచే అలికి అభినందనలు అని, ఈ సాంగ్ ను చూసి యువతలో మార్పు రావాలని తెలిపారు. కొందరు మృగాలు మహిళలను చెడు ఉద్దేశంతో చూస్తారని, తనను కన్నది మహిళ అనే విషయాన్ని మనిషి దుష్ట బుద్ధితో ప్రవర్తిస్తారు. తాగిన మత్తులో కొందరు మృగాలుగా మారుతారని, మన ఆలోచనలోనే మార్పు రావాలన్నారు. మహిళ రూపంలో ఉన్న ఓ తల్లిని గౌరవించలేని జీవితం వృథా..మన పుట్టుకకు మూలం మహిళ అనే విషయాన్ని మరవద్దు అని పేర్కొన్నారు. పురుషుని చూడగానే రక్షకుడిగా మహిళా భావించే పరిస్థితి రావాలి. మహిళలకు పురుషులు అంటే భరోసా ఉండాలి. మహిళా భద్రత కోసం మేము కమిటీలు వేసాము. మహిళా భద్రత కోసం అలీ రూపొందించిన పాట ప్రజల్లోకి వెళ్లేందుకు మా వంతు సహకారం అందిస్తాం అని చెప్పారు.

# విద్యుత్ షాక్ తో రైతు మృతి

పొలానికి నీరు పారపెట్టడానికి వెళ్లి విద్యుత్ షాక్ కు గురై రైతు మృతి చెందిన సంఘటన బిక్నూర్ మండలం లోని బస్వాపూర్ గ్రామంలో బుధవారం ఉదయం జరిగింది. గ్రామస్తులు



తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బైని మల్లారెడ్డి 61 ఉదయం తన సొంత పొలానికి నీరు పార పెట్టడానికి వెళ్లి స్టార్టర్ వద్ద విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు.

# మంగళ వారి పేట గ్రామంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం

**-ఎస్సై. సిహెచ్ రఘుపతి**




ఖానా పురం మండలం మంగళ వారి పేట గ్రామంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం నిర్వహించి నాలుగు బెల్ట్ షాపులను సీజ్ చేశారు. 21 వాహనాలు, సుమారు రూపాయలు 8500 విలువచేసే ఐఎంఎఫ్ఎల్ మధ్య మరియు గుట్కాను తనిఖీ చేశారు. మరియు సుమారుగా రూపాయలు 3000 విలువైన పొగాకు ఉత్పత్తులు, ఐ డి లిక్కర్ ఐదు లీటర్లు, 150 లీటర్ల వాష్ ను నాశనం చేయడంతో పాటు రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగం, డ్రగ్స్ మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపి నర్సంపేట్ కిరణ్ కుమార్, సిఐ దుగ్గొండి సాయి రామన్న, నెక్కొండ సిఐ చంద్రమోహన్, నర్సంపేట డిజన్ ఎస్, తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరోగ్య పరీక్షలు

వేములవాడ అర్బన్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థినిలకు వైద్య పరీక్షలు



నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేయడం చేశారు. ఈ వైద్య శిబిరంలో 174 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ స్వప్న, హన్మాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ మధు ప్రవచిని, డా స్వప్న, డా సాయి వైష్ణవి, ఆరోగ్య పర్యవేక్షకులు గంగమ్మ రాజు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# తక్కళ్లపహాడ్ లో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ క్రీడలు ప్రారంభం



**శాలిగౌరారం తెలంగాణ సేన న్యూస్ 8:**

శాలిగౌరారం మండలం తక్కళ్లపహాడ్ గ్రామంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ క్రీడలను జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసి తీరుపారి మల్లేష్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు స్నేహ భావాన్ని, ఐకమత్యంను పెంపొందిస్తాయన్నారు. మొదటి బహుమతి 20 వేలు,రెండవ బహుమతి 15 వేలు,మూడవ బహుమతి 8 వేలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భీమనబోయిన శంకర్, ఉపేందర్,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్..



**కంటోన్మెంట్ తెలంగాణ సేన న్యూస్ 8:**

మోండా డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రూపొందించిన నూతన సంవత్సర క్యాలండర్ ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినారు. అనంతరం శ్రీ పాండు రంగా విఠలేశ్వర వేంకటాద్రి స్వామి దేవాలయం శ్రీ గోదా కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో సత్యనారాయణ నాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబురావు, అల్లాడి గౌరీ శంకర్ ,నందికంటి రవి తదితరులు ఉన్నారు.




# బిజినెస్



## భారత్‌లో వన్‌ప్లస్ 13 సిరీస్ ఫోన్లు లాంచ్



టెక్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వన్ ప్లస్ 13 ఫోన్‌ను భారత్‌లోకి వచ్చేశాయి. మంగళవారం నిర్వహించిన వింటర్ లాంచ్ ఈవెంట్‌లో తన ఫ్లాగ్ షిప్ ఫోన్ వన్‌ప్లస్ 13 ను సంస్థ గ్రాండ్‌గా లాంచ్ చేసింది.

క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్‌తో వచ్చిన తొలి స్మార్ట్ ఫోన్ ఇది. 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.82 అంగుళాల క్వాడ్ హెచ్డీం అమోలెడ్ స్క్రీన్ (1440 %ఇ% 3168 పిక్సెల్స్) కలిగి ఉంటుంది. 4500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తుంది. 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, వెనుకవైపు 50 ఎంపీ ఎల్ వై టి - 808 మెయిన్ , 50 ఎంపీ అల్ట్రావైడ్, 50 ఎంపీ ట్రైప్రిజమ్ టెలిఫొటో కెమెరాలు ఉన్నాయి. 6000 ఎంఏహెచ్ బ్యాటరీతో 100 వాట్ సూపర్‌వూక్ ఫాస్ట్ ఛార్జింగ్, 50 వాట్ వైర్‌లెస్ ఛార్జింగ్ సపోర్ట్ చేస్తుంది.

వన్‌ప్లస్ 13 ఫోన్ 12జిబి ర్యామ్ ం 256జిబి స్టోరేజ్ వేరియంట్ ప్రారంభ ధర రూ.69,999, 16జిబి ం 512జిబి స్టోరేజ్ మోడల్ ధర రూ.76,999గా నిర్ణయించారు. ఇక 24జిబి ర్యామ్ ం 1టిబి ధర రూ.89,999గా ఉంది. ఈ ఫోన్లు అమెజాన్ సహా ఇతర ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో జనవరి 10 నుంచి ఈ ఫోన్లు అందుబాటులోకి రానున్నాయి. ఇక ఐసీఐసీఐ బ్యాంక్ కార్డ్ ద్వారా రూ.5 వేలు ఆఫర్ పొందొచ్చు. అదేవిధంగా రూ.7వేల వరకూ అదనపు ఎక్స్ఛేంజ్ ఆఫర్లు కూడా ఉన్నాయి.

## బడ్జెట్ 2025లో ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు కాబోతుందా..



కేంద్ర బడ్జెట్ 2025 సమీపిస్తున్న తరుణంలో 8వ వేతన సంఘం ఏర్పాటు గురించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మళ్లీ అంచనాలు పెరిగాయి. ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తమ డిమాండ్‌ను వింటారని ఆయా వర్గాలు భావిస్తున్నాయి. ప్రతి సంవత్సరం బడ్జెట్‌కు ముందు, ఆర్థిక మంత్రిత్వ శాఖ.. వివిధ రంగాలు, సమూహాల నుంచి డిమాండ్లు, సూచనలను తీసుకుంటుంది. ఈ గ్రూపులు ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో పనిచేస్తున్న కోట్లాది మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

**వేచి చూస్తున్న లక్షల మంది**

ఈ నేపథ్యంలోనే ఇటీవల కార్మిక సంఘాల ప్రతినిధులు ఆర్థిక మంత్రి సీతారామన్‌ను కలిశారు. 50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 67 లక్షల మంది పెన్షనర్లపై ప్రభావం చూపే ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు గురించి ప్రస్తావించారు. ప్రీ-బడ్జెట్ సంప్రదింపుల సమావేశంలో కొత్త పే కమిషన్ అంశాన్ని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (%జుఖ%) జాతీయ కార్యదర్శి స్వదేశ్ దేవ్ రాయ్ లేవనెత్తారు. ప్రస్తుతం ఏడో వేతన సంఘం ఏర్పడి 10 ఏళ్లు కావస్తున్నందున వెంటనే వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.

**కార్మిక సంఘాల డిమాండ్లు ఏంటి..**

సమావేశం అనంతరం టీయూసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్పీ తివారీ కీలక అంశాల గురించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చర్యలన్నింటినీ ప్రభుత్వం ఆపాలని కార్మిక సంఘాలు కోరుతున్నట్లు తెలిపారు. అనధికారిక కార్మికులకు సామాజిక రక్షణకు ఆర్థిక సహాయం చేయడానికి అతి సంపన్నులపై అదనంగా 2% పన్నును పెంచాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించాలని, వారికి కనీస వేతనాలు నిర్ణయించాల్సిన అవసరాన్ని కూడా తివారీ నొక్కి చెప్పారు.

**పన్ను మినహాయింపు పరిమితి పెంచాలి..**

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని, పెన్షన్ ఆదాయాన్ని పన్ను నుంచి మినహాయించాలని ఆయన సిఫార్సు చేశారు. ఎనిమిదో వేతన సంఘంతో పాటు ఆర్థిక మంత్రితో జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు కనీస %జూఖీూ %?పెన్షన్‌ను నెలకు 5,000 రూపాయలకు పెంచాలన్నారు. అదనంగా ప్రభుత్వ ఉద్యోగుల వేతన వ్యవస్థను సవరించడానికి 8వ వేతన సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను కేంద్ర మంత్రి ఫిబ్రవరి 1, 2025న సమర్పించనున్నారు.

**చాలా కాలంగా డిమాండ్..**

ఏడవ వేతన సంఘం పదవీకాలం డిసెంబర్ 2025లో ముగుస్తుంది. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఫిబ్రవరి 2014లో ఏడవ వేతన సంఘం ఏర్పడింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనవరి 2016లో దీని సిఫార్సులు అమలు చేయబడ్డాయి. ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు చేయాలని చాలా కాలంగా వివిధ కార్మిక సంఘాలు, ఉద్యోగుల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నాయి. గత నెలలో జాయింట్ జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ నేషనల్ కౌన్సిల్ (స్టాఫ్ సైడ్) కొత్త పే కమిషన్‌ను 'త్వరితగతిన' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర క్యాబినెట్ సెక్రటరీకి లేఖ రాసింది.

**ఇప్పటికే లేఖ కూడా..**

డిసెంబరు 3న రాసిన లేఖలో ఏడో వేతన సంఘం సిఫార్సులు అమలు చేసి 9 ఏళ్లు దాటిందని ఉద్యోగుల పక్షం ఉద్ఘాటించింది. తదుపరి జీతం, పెన్షన్ సవరణ జనవరి 1, 2026 నుంచి గడువు ఉందని తెలిపింది. యెన్ సి జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ కార్యదర్శి శివ్ గోపాల్ మిశ్రా తన లేఖలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, అలవెన్సులు, పెన్షన్లు, ఇతర ప్రయోజనాలను సవరించడం కోసం 1986లో నాల్గవ వేతన సంఘం నుంచి 10-సంవత్సరాల చారిత్రక పూర్వస్థితి గురించి ప్రస్తావించారు.

## ఎల్‌ఐసీ బెస్ట్ ప్లాన్.. 5 ఏళ్లు కడితే చాలు.. జీవితాంతం ఏడాదికి 50 వేలు గ్యారెంటీ రిటర్న్స్!

భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) తమ కస్టమర్ల అవసరాలకు తగినట్లుగా పాలసీలను అందిస్తోంది. ఏడాది క్రితం జీవన్ ఉత్సవ్ పేరుతో సరికొత్త పాలసీని తీసుకొచ్చింది. నవంబర్ 29,2023 నుంచి పాలసీ కస్టమర్లకు అందుబాటులోకి వచ్చింది. ఈ పాలసీలో ప్రీమియం పేమెంట్ టర్మ్ లిమిటెడ్‌గా ఉండి బెనిఫిట్స్ మాత్రం జీవితాంతం పొందేలా రూపొందించడం గమనార్హం. ఈ పాలసీ కొనుగోలు చేసి జీవితాంత గ్యారెంటీ రిటర్న్స్ పొందొచ్చు. ముందుగా నిర్దేశించిన టర్మ్ వరకు ప్రీమియం చెల్లిస్తే మీకు జీవితాంతం ప్రతి సంవత్సరం మీ పెట్టుబడిలో 10 శాతం చొప్పున పెన్షన్ రూపంలో వెనక్కి ఇస్తుంది. మరి ఈ పాసీ గురించి ఇప్పుడే తెలుసుకుందాం.


ఎల్‌ఐసీ జీవన్ ఉత్సవ్ ప్లాన్ కొనుగోలు చేసేందుకు వయసు 90 రోజుల నుంచి గరిష్ఠంగా 65 ఏళ్లుగా ఉంది. కనీస బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.5 లక్షలుగా ఉంటుంది. అంటే మీరు చెల్లించే ప్రీమియం మెచ్యూరిటీ సమయానికి రూ.5 లక్షలు నిండాల్సి ఉంటుంది. జీవన్ ఉత్సవ్ పాలసీ ప్రీమియమ్ కాల వ్యవధి 5-16 ఏళ్ల మధ్య ఉంటుంది. తమకు అనువైన టర్మ్ ఎంచుకోవచ్చు. ఈ పాలసీ కొనుగోలు చేసిన తర్వాతా నిర్దేశిత సమయం నుంచి ప్రతి సంవత్సరం పెట్టుబడిలో 10 శాతం చొప్పున పాలసీదారుడికి జీవితాంతం అందిస్తారు. పాలసీదారుడు 100 ఏళ్లు జీవించి ఉంటే అప్పటి వరకూ ఇలా డబ్బులు వస్తూనే ఉంటాయి.




**ఏడాదికి రూ.50 వేలు రావాలంటే..**

ఎల్‌ఐసీ జీవన్ ఉత్సవ్ పాలసీ బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.5 లక్షలుగా ఉంది. ప్రీమియం టర్మ్ 5-16 ఏళ్ల మధ్య ఎంచుకోవచ్చు. మీరు 5 సంవత్సరాల కాల వ్యవధి ఎంచుకున్నారు అనుకుందాం. అప్పుడు ఏడాదికి దాదాపు రూ.1.16 లక్షలు (జీఎస్టీతో కలిపి) ప్రీమియం కట్టాల్సి వస్తుంది. ప్రీమియం టర్మ్ 5 ఏళ్లు ముగిసిన తర్వాత మరో 5 సంవత్సరాలు డిఫెర్డ్ పీరియడ్ ఉంటుంది. అంటే 5 ఏళ్లు వేచి ఉండాలి. ఆ తర్వాత ఏడాది అంటే 11వ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం సమ్ అష్యూర్డ్ నుంచి 10 శాతం మీకు చెల్లిస్తారు. అంటే రూ.5 లక్షల పాలసీ తీసుకున్నారు కాబట్టి అందులో 10 శాతం అంటే రూ.50 వేలు వస్తాయి. పాలసీదారుడు జీవించి ఉన్నంత కాలం గ్యారెంటీ రిటర్న్స్ ఉంటాయి.

## నాలుగో రోజు భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం (జనవరి 8న) బలహీనంగా ప్రారంభమై, చివరకు కూడా భారీ నష్టాలతోనే ముగిశాయి. ఈ క్రమంలో ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీతోపాటు సూచీలు మొత్తం రెడ్‌లోనే ముగిశాయి. ఈ నేపథ్యంలో యెన్ యస్ ఈ నిఫ్టీ 50 ముగింపులో 18.95 పాయింట్లు క్షీణించి 23,688.95 స్థాయికి చేరుకోగా, సెన్సెక్స్ 50.62 పాయింట్లు క్షీణించి 78,148.49 వద్ద ముగిసింది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 367 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 599 పాయింట్లు పడిపోయింది. దీంతో మదుపర్లు కొన్ని గంటల వ్యవధిలోనే లక్షల కోట్ల రూపాయలను కోల్పోయారు.

**టాప్ 5 లాసింగ్ స్టాక్స్**

అయితే వరుసగా స్టాక్ మార్కెట్లు నాలుగోరోజు పతనం కావడం విశేషం. ఈ క్రమంలో అపోలో హాస్పిటల్, ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీల స్టాక్స్ టాప్ 5 నష్టాలతో ముగియగా,ఓ యెన్ జి సి , టి సి యస్ , రిలయన్స్, ఐ టి సి , ఏషియన్ పెయింట్స్ కంపెనీల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. ట్రెంట్ వరుసగా నాల్గో రోజు తక్కువగా ట్రేడైంది. ఈ క్రమంలో 52 వారాల గరిష్టం నుంచి 21% తగ్గింది. బుధవారం ఇంట్రా-డే డీల్స్‌లో %దీూజు%లో ట్రెంట్ షేర్లు 4 శాతం క్షీణించి రూ. 6,591కు చేరుకున్నాయి. అక్టోబర్ 14, 2024న తాకిన దాని 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.8,345.85 నుంచి 21 శాతం పడిపోయింది.

**మరోవైపు ఈ స్టాక్స్ కూడా..**

ఉదయం డాక్టర్ రెడ్డీ, ఓఎన్‌జీసీ, ఐషర్ మోటార్స్, రిలయన్స్, పవర్‌గ్రిడ్‌లు నిఫ్టీపై బుల్లిష్‌గా ఉన్నాయి. కాగా టెక్ మహీంద్రా, శ్రీరామ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, విప్రో, ఎస్‌బీఐ లైఫ్‌లు అత్యధికంగా క్షీణించాయి. బీఎస్ఈ సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 9 షేర్లు మాత్రమే గ్రీన్‌లో కొనసాగాయి. మిగిలిన 21 షేర్లు క్షీణించాయి. జొమాటోలో అతిపెద్ద క్షీణత నమోదైంది.

దీని తర్వాత అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, యెన్ టి పై సి , హెచ్ యూ ఎల్ వంటి షేర్లు క్షీణతతో ట్రేడయ్యాయి. ఆటోమోటివ్ సెమీకండక్టర్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన టాటా టెక్నాలజీస్, టెలిచిప్స్ తదుపరి తరం సాఫ్ట్‌వేర్-నిర్వచించిన వాహనాల (ఎస్ డి వి లు) కోసం వాహన సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను విప్లవాత్మకంగా మార్చడానికి సి ఈ ఎస్ 2025లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించిన తర్వాత షేర్ ధరలో పెరుగుదల కనిపించింది.

**మార్కెట్ ఎందుకు పడిపోయింది?**

మిడ్ స్మాల్‌క్యాప్ స్టాక్స్ మార్కెట్ మూడ్‌ని పాడు చేశాయని నిపుణులు అన్నారు. రిలయన్స్, ఆయిల్ %ఓ% గ్యాస్ షేర్ల బలం కారణంగా నిఫ్టీలో పతనం పరిమితమైంది. బలహీనమైన జిడిపి అంచనాలు బ్యాంకింగ్ స్టాక్‌లలో అమ్మకానికి దారితీశాయి. కింగ్‌ఫిషర్ బీర్ తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్, తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ టిజిబిసిఎల్)కి తక్షణమే బీర్ సరఫరాను నిలిపివేసినట్లు బుధవారం ప్రకటించింది.

## రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ రంగంలోకి టాటా డిజిటల్




న్యూఢిల్లీ: రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ విభాగంలోకి అడుగు పెడుతున్నట్లు టాటా డిజిటల్ మంగళవారం ప్రకటించింది. టాటా న్యూ సూపర్ యాప్‌పై తొలిసారిగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) విడుదల చేసినట్టు తెలిపింది. వినియోగదారులు సేవింగ్స్ బ్యాంక్ ఖాతా అవసరం లేకుండానే ఈ మార్కెట్ ప్లేస్ ద్వారా ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేయవచ్చని, డిపాజిట్‌పై వడ్డీ రేటు 9.1 శాతం వరకు ఉంటుందని కంపెనీ వెల్లడించింది. రూ.1,000 అతి చిన్న మొత్తం నుంచి ఇన్వెస్ట్ చేయవచ్చని తెలిపింది. డిపాజిట్లన్నింటికీ రూ.5 లక్షల వరకు డీఐసీజీసీ బీమా లభిస్తుందని, దీనివల్ల తమ సొమ్ము భద్రమే అన్న భరోసా వారికి లభిస్తుందని పేర్కొంది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల డిపాజిట్ల నుంచి తమకు ఆకర్షణీయంగా కనిపించిన దాన్ని కస్టమర్లు ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేయవచ్చని తెలిపింది.

## 56 శాతానికి పెరగనున్న డీఏ.

**-జనవరి 1 నుంచే అమల్లోకి**



పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా.. వీటికి పరిహారంగా కేంద్ర ప్రభుత్వం.. ప్రభుత్వ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్ (%ణూ%) ఇస్తుందన్న సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణం పెరిగితే డీఏ పెరుగుతూ ఉంటుంది. గత కొంత కాలంగా డీఏ పెరుగుతూనే ఉంది. ప్రతి సంవత్సరం రెండు సార్లు కేంద్ర ప్రభుత్వం.. డీఏను సవరిస్తుంటుంది. ఇది జనవరి 1, జులై 1 నుంచే అమల్లోకి వస్తున్నప్పటికీ.. ఏటా ఆలస్యంగా మార్చిలో ఒకసారి, సెప్టెంబర్ లేదా అక్టోబరులో మరోసారి డీఏపై ప్రకటన చేస్తూ ఉంది. బకాయిలతో కలిపి ముందువి అంటే జనవరి 1, జులై 1 నుంచే చెల్లిస్తుంటుంది కేంద్రం. ఇటీవల దీపావళి సమయంలో డీఏను 3 శాతం పెంచి.. 50 నుంచి 53 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.

ఇప్పుడు కొత్త సంవత్సరం రాగా.. జవవరి నెలలో సవరణ చేయాల్సి ఉంటుంది. అయితే ఈసారి కూడా మార్చి మొదటి వారంలోనే ప్రకటన వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక డీఏను కేంద్రం.. ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ (%ూ×జూ×-×ఔ%) డేటా ఆధారంగా నిర్ణయిస్తుంటుంది.

చివరిసారిగా నవంబర్ నెలలోనే ఏఐసీపీఐ డేటా విడుదల చేసింది కార్మిక మంత్రిత్వ శాఖ. ఇప్పుడు ఈ డేటా ప్రకారం.. డీఏ మరో 3 శాతం పెరిగి 56 శాతానికి చేరాల్సి ఉందని తెలుస్తోంది. ఇదే జరిగితే 2025 మార్చిలో ప్రకటన వచ్చినప్పటికీ.. 2025, జనవరి 1 నుంచే ఇది అమల్లోకి రావాల్సి ఉంటుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి 3 నెలలకు బకాయిలతో కలిపి ఏప్రిల్ జీతంతో కలిపి విడుదల చేయాల్సి ఉంటుంది.

నవంబర్ నెలలో వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం స్థిరంగానే ఉన్నప్పటికీ.. డీఏను నిర్ణయించడంలో డిసెంబర్ గణాంకాలు కూడా కీలకం కానున్నాయి. వీటన్నింటి సగటును బట్టి తుది డీఏను నిర్ణయిస్తారని చెప్పొచ్చు. చివరిగా 55 శాతం లేదా 56 శాతానికి డీఏ చేరుతుందని భావిస్తున్నారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెరిగితే.. ఇదే సమయంలో పెన్షనర్లకు డీఆర్ (డియర్‌నెస్ రిలీఫ్) కూడా పెరగాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం తీసుకుంటే.. కోటి మందికిపైగా ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం కలగనుంది.

**జీతం ఎంత పెరుగుతుంది?**

డీఏ అనేది ఉద్యోగుల కనీస వేతనంపై (బేసిక్ పే) వర్తిస్తుంది. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కనీస వేతనం రూ. 30 వేలు అనుకుంటే.. ఇక్కడ 53 శాతం డీఏ ప్రకారం వారికి రూ. 15900 వచ్చేది. ఇప్పుడు మరో 3 శాతం పెరిగితే.. 56 శాతం డీఏ ప్రకారం.. మొత్తం రూ. 16,800 అంటే .. అప్పుడు రూ. 900 పెరుగుతుందని చెప్పొచ్చు. డీఆర్‌కు కూడా ఇదే ఫార్ములా వర్తిస్తుంది.

# చక్కని ఆరోగ్యం

## రోజూ పాలలో కుంకుమ పువ్వు కలిపి తాగితే లాభాలు



గర్భంతో ఉన్న మహిళలు కుంకుమ పువ్వును పాలలో కలిపి తాగుతుంటారు. ఆయుర్వేద పరంగా చూస్తే కుంకుమ పువ్వు అనేక లాభాలను అందిస్తుంది. కనుకనే గర్భిణీలకు కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగమని చెబుతుంటారు. అయితే వాస్తవానికి కుంకుమ పువ్వు కలిపిన పాలను కేవలం గర్భిణీలే కాదు, ఎవరైనా సేవించవచ్చు. కుంకుమ పువ్వు గొప్ప ఔషధంగా పనిచేస్తుంది. అందువల్ల దీన్ని కలిపిన పాలను తాగితే ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలను పొందవచ్చు. కుంకుమ పువ్వులో మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. కుంకుమ పువ్వును పోషకాలకు గనిగా చెప్పవచ్చు. ఈ క్రమంలోనే రోజూ రాత్రి కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగితే అనేక లాభాలను పొందవచ్చు.

**గాఢ నిద్ర పడుతుంది..**

కుంకుమ పువ్వులో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇందులో క్రోసిన్‌తోపాటు సఫ్రనాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగితే ఆరోగ్యంగా ఉండవచ్చు. రోగాలు రాకుండా శరీరాన్ని రక్షించుకోవచ్చు. కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగితే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట ఈ పాలను తాగితే మనస్సు ప్రశాంతంగా మారుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు.

**గ్యాస్ సమస్యకు పరిష్కారం..**

చాలా మంది భోజనం చేసిన వెంటనే గ్యాస్ వస్తుందని వాపోతుంటారు. అయితే ఇందుకు కుంకుమ పువ్వు పాలను చక్కని పరిష్కారంగా చెప్పవచ్చు. కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం ఉండవు. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. కుంకుమ పువ్వు చర్మ సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా చూసుకోవచ్చు. రోజూ రాత్రి పూట కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగితే చర్మం సురక్షితంగా ఉంటుంది. చర్మ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం మృదువుగా, కాంతివంతంగా మారుతుంది.

**ఎముకల ఆరోగ్యానికి..**

పాలలో క్యాల్షియం అధికంగా ఉంటుందన్న సంగతి తెలిసిందే. అయితే కుంకుమ పువ్వులోనూ క్యాల్షియం ఎక్కువగానే ఉంటుంది. అందువల్ల రెండింటినీ కలిపిన మిశ్రమాన్ని రోజూ తాగుతుంటే శరీరానికి క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు రోజూ కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగితే త్వరగా కోలుకోవచ్చు. ఈ పాలను సేవించడం వల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. చలికాలంలో సహజంగానే చాలా మందికి దగ్గు, జలుబు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. కానీ కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగితే ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. గొంతు, ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫం కరిగిపోతుంది. ఇలా కుంకుమ పువ్వును రోజూ పాలలో కలిపి తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## చలికాలంలో.. వేడివేడిగా!



చలికాలం.. వాతావరణం విభిన్నంగా ఉంటుంది. ఉదయాన్నే కమ్ముకునే పొగమంచు.. మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అయితే.. ఆ ఆహ్లాదం వెనకే, అనారోగ్యమూ దాగి ఉంటుంది. చల్లని వాతావరణం.. శరీరానికి అనేక సమస్యలను తెచ్చి పెడుతుంది. అయితే, ఒక చిన్న చిట్కా ద్వారా.. ఇలాంటి ఎన్నో సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే 'వేడినీరు తాగడం'.. నిత్యకృత్యంగా చేసుకోవాలని సూచిస్తున్నారు.


శీతకాలంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలు.. జలుబు, ముక్కుదిబ్బడ. ముఖ్యంగా, సైనసైటిస్ ఉన్నవారికి ఈ చల్లని వాతావరణం నరకమే! ఉదయాన్నే ఒక గ్లాసు వెచ్చని నీరు తాగితే.. జలుబు, సైనస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతులో శ్లేష్మాన్ని కరిగించడంలో వేడినీరు సాయపడుతుంది. వేడినీటి నుంచి వచ్చే ఆవిరి.. సైనస్ వల్ల కలిగే ఒత్తిడిని తగ్గిస్తుంది. చలి తీవ్రత పెరిగితే.. శరీరంలో రక్తనాళాలు కుంచించుకుపోతాయి. ఫలితంగా.. శరీర అవయవాలకు రక్త సరఫరా మందగిస్తుంది. అయితే.. వేడినీళ్లు అద్భుతమైన వాసోడైలేటర్‌గా పనిచేస్తాయి. ఇవి రక్తనాళాలను విస్తరింపజేసి.. రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. ఫలితంగా, గుండె ఆరోగ్యానికీ ప్రయోజనం చేకూరుతుంది. కండరాల నొప్పి నుంచీ ఉపశమనం కలుగుతుంది.

చలికాలంలో కొందరిలో 'అచలాసియా కార్డియా' సమస్య కనిపిస్తుంది. అన్నవాహిక కండరాలపై ప్రభావం చూపే ఈ సమస్య వల్ల ఆహారం తీసుకోవడం, నీళ్లు తాగడం కూడా కష్టమైపోతుంది. అయితే.. అన్నవాహిక కండరాలను సడలించడంలో వేడినీరు సాయపడుతుంది. తద్వారా అచలాసియా లక్షణాలు తగ్గి.. ఆహారం, నీళ్లు మింగడం సులభం అవుతుంది.

వేడినీటిని తాగడం.. జీర్ణవ్యవస్థకూ ప్రయోజనకరంగా ఉంటుంది. జీర్ణ అవయవాలకు రక్త ప్రవాహాన్ని ప్రేరేపిస్తుంది. వాటి పనితీరును మెరుగుపరుస్తుంది. వేడినీటిలో ఒక టీస్పూన్ నిమ్మరసం కలుపుకొని తాగితే.. ఆహారం త్వరగా విచ్ఛిన్నం అవుతుంది. శరీరం పోషకాలను మరింత సమర్థంగా గ్రహించేలా సాయపడుతుంది. మలబద్ధకం, కడుపుబ్బరం, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. వేడినీళ్లు.. పేగులను ఉత్తేజపరుస్తాయి. వాటి కదలికలను ప్రోత్సహిస్తాయి. ఆహారాన్ని సమర్థంగా విచ్ఛిన్నం చేస్తాయి. ఫలితంగా.. మలబద్ధకం దూరమవుతుంది. చల్లని వాతావరణానికి ప్రతిస్పందనగా శరీరం వణుకుతుంది. అలాంటి సమయంలో వేడినీటిని తాగడం వల్ల.. శరీర అంతర్గత ఉష్ణోగ్రత పెరిగి.. వణుకు తగ్గుతుంది.

చలికాలంలో చెమట ఎక్కువగా పట్టదు. దీంతో శరీరంలోని వ్యర్థాలు లోపలే ఉండిపోతాయి. వేడినీరు తాగడం వల్ల.. శరీరంలో అంతర్గత ఉష్ణోగ్రత పెరిగి చెమట బాగా పడుతుంది. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపించేస్తుంది. ఫలితంగా.. కాలేయం, మూత్రపిండాల పనితీరుకు భరోసా ఇస్తుంది.

## మీ కాళ్లు బలహీనంగా ఉన్నాయా.. వీటిని తినండి.. దృఢంగా మారుతాయి..!



శరీరంలోని అన్ని అవయవాలు బలంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ప్రతి ఒక్క అవయవం ఆరోగ్యంగా, దృఢంగా ఉంటేనే శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ క్రమంలోనే కొందరు శరీరం ఎంత దృఢంగా ఉన్నప్పటికీ కాళ్లు బలహీనంగా ఉంటాయి. అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంటుంది. అలాగే కండరాల నిర్మాణం కూడా సరిగ్గా ఉండదు. దీంతో పాదాల నొప్పులు వస్తుంటాయి. అయితే సరైన ఆహారం తీసుకుంటే శరీరంలోని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉండి కండరాల నిర్మాణం జరగాలంటే ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. పలు ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల కాళ్లను దృఢంగా ఉంచుకోవచ్చు. కాళ్లలో ఉండే కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఇక అందుకు ఏమేం ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**చికెన్..**

చికెన్‌ను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. అయితే చికెన్‌లో లెగ్ పీస్‌లను తింటుంటారు. ప్రోటీన్లు కావాలంటే చికెన్ బ్రెస్ట్ పీస్‌లను తినాలి. లెగ్ పీస్‌లకు కొవ్వు బాగా ఉంటుంది. కనుక లెగ్ పీస్‌లను తినకూడదు. బ్రెస్ట్ పీస్‌లలో ప్రోటీన్లు ఉంటాయి. కనుక బ్రెస్ట్ పీస్‌లను తింటే కండరాలకు బలం కలుగుతుంది. ముఖ్యంగా కాళ్లలో ఉండే కండరాలు నిర్మాణం అవుతాయి. కండరాలు దృఢంగా మారుతాయి. అదేవిధంగా పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. దీంతోపాటు కండరాలకు బలం కలుగుతుంది. పెరుగును తింటున్నా కూడా కాళ్లు బలంగా మారుతాయి. ఆరోగ్యంగా ఉంటాయి. పెరుగులో ఉండే ప్రొబయోటిక్ ఆహారాలు, ప్రోటీన్లు కండరాలకు మేలు చేస్తాయి. కనుక పెరుగును రోజూ తినాలి.

**పనీర్..**

పనీర్‌ను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. పనీర్ ద్వారా మనకు ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. దీంతో కండరాల నిర్మాణం జరుగుతుంది. కాళ్లు బలహీనంగా ఉన్నవారు పనీర్ ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కాళ్లలోని కండరాలు దృఢంగా మారుతాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే పాలకూరను తినడం వల్ల కూడా కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. దీని వల్ల శరీరానికి కావల్సిన క్యాల్షియం లభించడంతోపాటు ప్రోటీన్లు కూడా అందుతాయి. దీంతో కాళ్లు దృఢంగా మారుతాయి. అలాగే కాళ్లు బలంగా మారాలంటే చిలగడదుంపలను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ప్రోటీన్లను, శక్తిని అందిస్తాయి.

**చియా విత్తనాలు..**

ఇక సముద్రపు చేపలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు ఈ చేపలను తింటే మంచిది. దీంతో మన శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి ఎంతగానో దోహదం చేస్తాయి. దీంతో కాళ్లు దృఢంగా, ఆరోగ్యంగా మారుతాయి. అలాగే క్వినోవాను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో శక్తిని అందిస్తాయి. కండరాలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. ప్రోటీన్లను అందిస్తాయి. దీని వల్ల కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అదేవిధంగా చియా విత్తనాలను కూడా తినవచ్చు. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కాళ్లను బలంగా మారుస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల కాళ్లు బలంగా మారుతాయి. శరీరానికి కూడా శక్తి లభిస్తుంది.



## పచ్చిగా తింటే..

కూరగాయల్లో ఎన్నోరకాల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అనేక వ్యాధులను దూరం చేస్తాయి. అయితే, కూరగాయలను ఉడికిస్తే.. వాటిలో పోషకాలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పచ్చిగానే తీసుకుంటే పోషకాలు పూర్తిస్థాయిలో శరీరానికి అందుతాయని అంటున్నారు. అయితే, ఇలా అన్నిరకాల పదార్థాలను పచ్చిగా తీసుకోవడం కూడా ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

క్యారెట్ మాదిరిగా ముల్లంగిని పచ్చిగా తినకూడదు. ఇందులోని గాయిట్రోజెన్స్ అనే పదార్థం.. థైరాయిడ్ పనితీరుపై ప్రభావం చూపుతుంది. దీనిని నేరుగా తీసుకుంటే.. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.

పాలకూరలో ఆగ్జలేట్ ఎక్కువ. ఇది కిడ్నీలో రాళ్లను ఏర్పరుస్తుంది. అతిగా తీసుకుంటే.. మలబద్ధకం ఇబ్బంది పెడుతుంది.

కొన్ని కోడిగుడ్లలో సాల్మొనెల్లా అనే బ్యాక్టీరియా పెరుగుతుంది. వీటిని నేరుగా తీసుకోవడం వల్ల ఆహారం విషపూరితమయ్యే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా.. కడుపునొప్పి, వాంతులతోపాటు జ్వరం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. కాబట్టి, కోడిగుడ్లను సరైన ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తినడమే మంచిది. కొన్నిసార్లు హాఫ్ బాయిల్డ్ కూడా అనారోగ్యాన్ని కలిగించవచ్చు.

బీన్స్‌ను పచ్చిగా తీసుకుంటే.. కడుపులో హైడ్రోజెనిక్ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. ఫలితంగా.. వికారం, వాంతులు, విరేచనాలు ఇబ్బంది పెడతాయి.

ఆలుగడ్డల్లో సొలానిన్ అనే టాక్సిన్ ఉంటుంది. ఇది నరాల సమస్యలు, వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలను కలగజేస్తుంది. కాబట్టి, ఆలుగడ్డలను ఉడికించి తినడమే బెటర్!

పచ్చిగా తినే అవకాశం ఉన్న కూరగాయలను కూడా ఎక్కువ మొత్తంలో తీసుకోవడం మంచిదికాదు. పరిమితికి మించి తీసుకుంటే.. కడుపు ఇన్ఫెక్షన్లు, అజీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఉడికించిన కూరగాయలతో పోలిస్తే.. పచ్చివి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. వీటిలోని పోషకాలను శరీరం నెమ్మదిగా గ్రహిస్తుంది. దాంతో జీర్ణక్రియ వేగం తగ్గుతుంది. కొన్నిరకాల కూరగాయల్లో యాంటి న్యూట్రియంట్ గుణాలు ఉంటాయి. అవి ఆహారంలో పోషకాల శోషణను పూర్తిగా నిరోధిస్తాయి. అలాంటి కూరగాయలను ఉడికించి తీసుకోవడమే మంచిది.

## హెచ్ఎంపీవీ కలకలం

**-ఈ ఆహార పదార్థాలతో చెక్ పెట్టండిలా..!**

హైదరాబాద్ : హెచ్ఎంపీవీ వైరస్ కలకలం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఇండియాలోనూ కేసులు నమోదు అవుతున్నాయి. బెంగళూరు, అహ్మదాబాద్‌లో హెచ్ఎంపీవీ కేసులు నమోదు కావడంతో.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అలర్ట్ అవుతున్నాయి. అంతేకాకుండా హెచ్ఎంపీవీ వైరస్ నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? రోగ నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలనే దానిపై డాక్టర్లు పలు సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఈ వైరస్‌ను ఎదుర్కోవాలంటే మన మెనూలో స్వల్ప మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. డైట్ ప్లాన్ తప్పనిసరిగా ఉండాలని చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు గురైన త్వరగా కోలుకోనే సామర్థ్యం ఉంటుందని చెబుతున్నారు.

**ఏయే ఆహార పదార్థాలు తీసుకోవాలంటే..?**

యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. అంటే ఉసిరి, ఆరెంజ్, నిమ్మ, రెడ్ పెపర్ తీసుకోవాలి. ఉసిరిలో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. ఆరెంజ్, నిమ్మలో కూడా



విటమిన్ సీతో పాటు ఫ్లావినాయిడ్స్, లిమోనాయిడ్స్ ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. రెడ్ పెప్పర్‌లో విటమిన్ సీ, విటమిన్ బీ6, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా లభిస్తాయి.

పసుపు, అల్లం, దాల్చిన చెక్క కూడా వైరల్ ఇన్‌ఫెక్షన్లకు మంచి మెడిసిన్‌గా పని చేస్తాయి. విటమిన్ డీ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహార పదార్థాలను కూడా తీసుకోవాలి. చేపలు, మష్రూమ్స్(పుట్టగొడుగులు), పాల ఉత్పత్తులు కూడా మంచివి. రెండు రోజులకు ఒకసారి దానిమ్మ తింటే మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ గ్రీన్ టీ సేవించొచ్చు.